ప్రభాత
తెలుగు దినపత్రిక
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
21-10-2024
సోమవారం
మల్కాజిగిరి
సంపుటి : 02 | సంచిక : 46 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB జయభేరి



# రిస్క్ తీసుకోకుండా లక్ష్యాలను సాధించలేము

జీవితంలో గొప్ప పనులు చేయాలంటే కొంత రిస్క్ తీసుకోవాలని, రిస్క్ తీసుకోకుండా లక్ష్యాలను సాధించలేమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. మంచి నాయకుడిగా ఎదగడంలో ధైర్యం, త్యాగం కీలకమైన అంశాలన్నారు. ISB నిర్వహించిన నాయకత్వ సదస్సు (ISBACON2024) లో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లీడర్ షిప్ ఇన్ న్యూ ఇండియా అంశంపై ప్రసంగించారు.

హైదరబాద్ నగరాన్ని ప్రపంచస్థాయి నగరంగా నిలబెట్టడంలో అందరి సహకారం కావాలని సదస్సులో కోరారు. దేశంలోని నగరాలతో కాకుండా, న్యూయార్క్, ప్యారిస్, టోక్యో , సియోల్ వంటి నగరాలతో హైదరాబాద్ పోటీ పడాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. ISB విద్యార్థులు హైదరాబాద్, తెలంగాణతో పాటు న్యూ ఇండియాకు బ్రాండ్ అంబాసిడర్లు అని, తెలంగాణను ట్రిలియన్ ఎకానమీ ఆర్థిక వ్యవస్థగా మార్చాలన్న లక్ష్యసాధనలో సహకరించాలని, వెళ్లే ప్రతి చోట తెలంగాణ, హైదరాబాద్ గురించి మాట్లాడాలని సూచించారు. రాష్ట్రంలో స్కిల్స్ యూనివర్సిటీ, గచ్చిబౌలిలో స్పోర్ట్స్ యూనివర్సిటీల ప్రాధాన్యత, వాటి ప్రాముఖ్యతలను వివరించారు. హైదరాబాద్ నగరాన్ని దేశానికి ఒక రోల్ మాడల్ గా, గ్లోబల్ లీడర్ గా తీర్చిదిద్దాలన్నదే తమ ఆలోచన అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు.

## పెళ్లి ప్రస్తావన తేవడంతోనే
# పెట్రోల్ దాడి

కడప జిల్లా బద్వేల్ లో ఇంటర్ విద్యార్థిని పెట్రోల్ దాడి ఘటనను పోలీసులు ఛేదించారు. ఈ దాడికి పాల్పడిన నిందితుడు విఘ్నేష్ అరెస్టు చేశామని ఎస్పీ హర్షవర్ధన్ తెలిపారు. వీరిద్దరికి ఐదేళ్ల పరిచయం ఉందన్నారు. పెళ్లి ప్రస్తావన తేవడంతోనే పథకం ప్రకారమే దాడి చేశాడని ఎస్పీ తెలిపారు.

కడప జిల్లా బద్వేల్ సమీపంలో ఇంటర్ విద్యార్థినిపై పెట్రోల్ దాడి ఘటనను పోలీసులు ఛేదించారు. యువతిపై దాడికి పాల్పడిన విఘ్నేష్ అనే యువకుడిని కడప శివారులో అరెస్టు చేసినట్లు ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. ఆదివారం సాయంత్రం మీడియా సమావేశంలో ఈ ఘటనకు సంబంధించిన వివరాలను ఎస్పీ తెలిపారు. విఘ్నేష్ పక్కా పథకం ప్రకారమే ఈ దారుణానికి పాల్పడినట్లు దర్యాప్తులో తేలిందన్నారు.

**పక్కా ప్లాన్ ప్రకారమే**

నిందితుడు విఘ్నేష్ కడపలోని ఓ హోటల్ వంట మాస్టర్ గా పనిచేస్తున్నాడు. ఇటీవల అతడికి వివాహం అయ్యింది. అతడి భార్య గర్భిణి. విఘ్నేష్, బాధిత బాలిక(16)కు ఐదేళ్ల పరిచయం ఉంది. బాధితురాలు స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. శుక్రవారం విఘ్నేష్, విద్యార్థినికి ఫోన్ చేసి కలవాలని కోరాడు. లేదంటే తాను సూసైడ్ చేసుకుంటానని బెదిరించాడు. దీంతో విద్యార్థిని శనివారం కాలేజీ నుంచి ఆటోలో బయలుదేరగా... మార్గమధ్యలో విఘ్నేష్ ఆ ఆటో ఎక్కాడు. వీరిద్దరూ బద్వేలుకు సుమారు 10 కి.మీ. దూరంలో ఉన్న సెంచరీ ప్లైవుడ్ ఫ్యాక్టరీ సమీపంలో ఆటో దిగిపోయారు. అనంతరం వారిద్దరూ సమీపంలోని ఓ నిర్మానుష్య ప్రాంతంలోకి వెళ్లి కాసేపు శరీరకంగా కలిశారు. బాధిత బాలిక తనను పెళ్లి చేసుకోవాలని అడగడంతో విఘ్నేష్ కోపంతో తన వెంట తెచ్చుకున్న పెట్రోల్ పోసి నిప్పంటించాడు. బాలిక బిగ్గరగా కేకలు వేయడంతో విఘ్నేష్ అక్కడ నుంచి పరారయ్యాడు. స్థానికులు బాలికను గుర్తించి, కాపాడారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల బాలికను కడప రిమ్స్‌కు తరలించారు. రిమ్స్ లో చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి 2.30గంటలకు విద్యార్థిని మృతి చెందింది.

2 లో



# ఇదేమి రాజ్యం బాబు గారూ?

ప్రతిరోజు హత్యాచారాలు, హత్యలు వైఎస్ జగన్ ఏపీలో మహిళలు, బాలికలకు రక్షణ కరవైంది, ఇదేమి రాజ్యం? అని వైసీపీ అధినేత వైఎస్ జగన్ ప్రశ్నించారు. బద్వేలు ఘటన అత్యంత హేయమన్నారు. సీఎం చంద్రబాబు వైసీపీపై కక్షతో దిశ వంటి మంచి కార్యక్రమాన్ని నిలిపివేశారని విమర్శించారు.

2 లో



## రేవంత్ రెడ్డి చీఫ్ మినిస్టర్ కాదు..
# చీటింగ్ మ్యాన్

సీఎం రేవంత్ రెడ్డి పై హరీష్ రావు ఫైర్ అయ్యారు. ఎనుముల రేవంత్ రెడ్డి కాదు.. ఎగవేతల రేవంత్ రెడ్డిగా మారారని విమర్శించారు. రేవంత్ రెడ్డి చీఫ్ మినిస్టర్ కాదు.. చీటింగ్ మ్యాన్ అని ఎద్దేవా చేశారు. రైతులను, మహిళలను, నిరుద్యోగులను.. అందరిని దగా చేశారని ఆరోపించారు.

**జయభేరి, కరీంనగర్ :**

కరీంనగర్ జిల్లా మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో.. అలయ్ బలయ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హరీష్ రావు హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీరు, రేవంత్ రెడ్డి వైఖరిపై మండిపడ్డారు. 6 గ్యారంటీ స్కీమ్‌లు అమలు అయ్యేవరకు..



2 లో



# పదేళ్ల కిందటి పరిస్థితిని గుర్తు చేసుకోవాలి

## ప్రతిపక్షాలపై మోదీ విమర్శలు

**జయభేరి, వారణాసి:**

కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆ పార్టీలు బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడుతున్నాయంటూ ఆరోపించారు. వారణాసిలో రూ. 6,700 కోట్ల అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన ప్రధాని.. ఈ సందర్భంగా ప్రతిపక్షాలపై విమర్శలు చేశారు. ''పదేళ్ల క్రితం వారణాసిలో అవినీతి, కుంభకోణాలే ముఖ్యాంశాలుగా నిలిచేవి. కానీ, ఇప్పుడు పరిస్థితి మారింది. కాశీ అభివృద్ధికి దూరం కావడానికి కారణం ఏంటి..? దశాబ్దం కిందటి పరిస్థితి గుర్తు చేసుకోవాల్సి అవసరం ఉంది. ఉత్తరప్రదేశ్‌ను సుదీర్ఘ కాలం పాలించిన వారు.. దిల్లీని దశాబ్దాల పాటు ఏలిన వారు వారణాసి అభివృద్ధిని ఎందుకు పట్టించుకోలేదు..? ఈ ప్రశ్నకు సమాధానం బంధుప్రీతి, బుజ్జగింపు రాజకీయాలు. ఎస్పీ, కాంగ్రెస్‌లకు వారణాసి అభివృద్ధి ముఖ్యం కాదు. భవిష్యత్తులోనూ ప్రాధాన్యత ఇవ్వరు. కానీ, భాజపా 'సబ్‌కా వికాస్' లక్ష్యంగా ప్రభుత్వాన్ని నడుపుతోంది'' అని ప్రధాని వ్యాఖ్యానించారు.

## శాంతిభద్రతలపై
# మాటల యద్ధం

### జగన్‌కు మంత్రి లోకేశ్ 7 ప్రశ్నలు

2 లో



**జయభేరి, అమరావతి:**

రాష్ట్రంలో శాంతిభద్రతల గురించి జగన్ మాట్లాడటం విడ్డూరంగా ఉందని మంత్రి నారా లోకేశ్ విమర్శించారు. గత ఐదేళ్ల పాలనలో వేల మంది చనిపోయినా, ఏనాడూ కనీసం ఒక్క సమీక్ష నిర్వహించని వ్యక్తి 'లా అండ్ ఆర్డర్' గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు ''గంజాయి, డ్రగ్స్‌ని వ్యాప్తి చేసి సొమ్ము చేసుకున్నావ్, ఊరికో ఉన్మాదిని పెంచి పోషించి, ప్రజల మీదకు వదిలావ్. ఎర్రచందనం స్మగ్లర్లకు టికెట్లు ఇచ్చావ్. అలాంటి నువ్వు లా అండ్ ఆర్డర్ గురించి మాట్లాడుతున్నావా?'' అంటూ జగన్‌ను ఎక్స్ వేదికగా విమర్శించారు. ఈ మేరకు లోకేశ్.. 7 ప్రశ్నలు సంధించారు.

''1. నీ 5 ఏళ్ళ పాలనలో 2,027 మంది మహిళలు దారుణ హత్యకు గురయ్యారు. 30 వేల మంది మహిళలు అదృశ్యమయ్యారు. ఎప్పుడైనా కనీసం ఒక్కరి దగ్గరికైనా వెళ్లి పరామర్శించావా? ఒక్కసారైనా సమీక్షించావా?

3 లో




# అనుమతులుంటే.. కూల్చం..!

సీఎం ఆదేశాలను అమలు చేస్తాం
హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రకటన
ముఖ్యమంత్రి ప్రకటన నేపథ్యంలో స్పష్టత
అనుమతుల్లేని వాటినే కూల్చామని వెల్లడి

▶▶ మొదటిపేజీ తరువాయి

## ఇదేమి రాజ్యం బాబు గారూ?

"ఏపీలో లా అండ్ ఆర్డర్‌ను కాపాడలేకపోతున్నారు.. ఇదేమి రాజ్యం సీఎం చంద్రబాబు" అని మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ ప్రశ్నించారు. మహిళలకు, బాలికలకు రక్షణ కూడా ఇవ్వలేకపోతున్నారు... ఇదేమి రాజ్యం? అంటూ ఎక్స్ వేదికగా ప్రశ్నలు సంధించారు. రాష్ట్రంలో ప్రతిరోజూ ఏదోచోట హత్యాచారాలు, హత్యలు, వేధింపులు సర్వసాధారణమైపోయాయన్నారు. బద్వేలులో ఇంటర్ విద్యార్థినిపై పెట్రోలుపోసి, నిప్పుపెట్టి ప్రాణాలు తీసిన ఘటన అత్యంత హేయం, దుర్మార్గం అన్నారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నానన్నారు. ఈ ఘటన వెనుక రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు వ్యవస్థల వైఫల్యం కూడా ఉందన్నారు. ప్రజలు నిరంతరం భయపడే స్థాయికి రాష్ట్రాన్ని తీసుకెళ్లారని విమర్శలు చేశారు. సీఎం చంద్రబాబు వైసీపీ మీద కక్షకొద్దీ, వైసీపీ తెచ్చిన పథకాలను, కార్యక్రమాలను ఎత్తివేస్తూ రాష్ట్రం మీద, ప్రజలమీద కక్షసాధిస్తున్నారని వైఎస్ జగన్ ఆరోపించారు. ఇది అన్యాయం అని, వైయస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో బాలికలు, మహిళల భద్రతకు పూర్తి భరోసానిస్తూ తీసుకొచ్చిన దిశ కార్యక్రమాన్ని ఉద్దేశపూర్వకంగా నీరుగార్చడం దీనికి నిదర్శనం అన్నారు. ఇందువల్లే మహిళలు, బాలికల భద్రత ప్రశ్నార్థకం అయ్యిందన్నారు.

"దిశ" యాప్‌లో SOS బటన్ నొక్కినా, చేతిలో ఉన్న ఫోన్‌ను 5సార్లు అటూ, ఇటూ ఊపినా వెంటనే కమాండ్ కంట్రోల్ రూమ్ కు, అక్కడ నుంచి దగ్గర్లోనే ఉన్న పోలీసులకు సమాచారం వెళ్తుందన్నారు. వెంటనే పోలీసులు వారికి ఫోన్ చేస్తారని, వారు ఫోన్ ఎత్తకపోయినా లేదా ఆపదలో ఉన్నట్టు ఫోన్లో చెప్పినా ఘటనాస్థలానికి నిమిషాల్లో చేరుకుని రక్షణ కల్పించే పటిష్ట వ్యవస్థను కూటమి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా నీరుగార్చలేదా? అని ప్రశ్నించారు. "దిశ" ప్రారంభం మొదలు 31,607 మహిళలు, బాలికలు రక్షణ పొందితే దాన్ని ఎందుకు దెబ్బతీశారని వైఎస్ జగన్ ప్రశ్నించారు. 1.56 కోట్ల మంది డౌన్లోడ్ చేసుకుని భరోసా పొందుతున్న దిశపై రాజకీయ కక్ష ఎందుకని నిలదీశారు.

"దిశ కార్యక్రమాన్ని బలోపేతం చేయడానికి ప్రత్యేకంగా 13 పోక్సో కోర్టులు, 12 మహిళా కోర్టులు, ఫోరెన్సిక్ ల్యాబులు ఏర్పాటు చేశాం. ప్రత్యేకంగా ప్రతి జిల్లాలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమించాం. 900 బైక్‌లు, 163 బొలేరో వాహనాలను "దిశ" కార్యక్రమం కోసమే పోలీసులకు అందించి పెట్రోలింగ్‌ను పటిష్టచేశాం. 18 దిశ పోలీస్‌స్టేషన్లను పెట్టి, 18 క్రైమ్ మేనేజ్మెంట్ వాహనాలను సమకూర్చాం. వీటిని పోలీస్ కమాండ్ కంట్రోల్‌రూమ్‌కు అనుసంధానం చేశాం. వైసీపీ హయాంలో శాంతిభద్రతలలో "దిశ" కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చేవాళ్లం. దీంతో పోలీసులు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండేవారు" వైఎస్ జగన్ దిశ సహా వ్యవస్థలను నిర్వీర్యంచేసి సీఎం చంద్రబాబు ఏం సాధించాలనుకుంటున్నారని వైఎస్ జగన్ ప్రశ్నించారు. మహిళల రక్షణ, సాధికారతకోసం అమలవుతున్న కార్యక్రమాలను, స్కీంలను ఎత్తివేసి, ఇప్పుడు ఇసుక, లిక్కర్ లాంటి స్కాంలకు పాల్పడుతూ పేకాట క్లబ్బులు నిర్వహిస్తున్నారని విమర్శించారు. ఇటు పోలీసు వ్యవస్థ కూడా అధికారపార్టీ అడుగులకు మడుగులొత్తుతూ ప్రతిపక్షంపై తప్పుడు కేసులు పెడుతూ వేధింపులకు దిగడమే పనిగా పెట్టుకుందన్నారు. పోలీసులు మహిళలు, బాలికలు, చిన్నారుల రక్షణ బాధ్యతలను పట్టించుకోవడంలేదన్నారు.

### పెట్రోల్ దాడి

బాలికపై దాడి చేయాలనే ఉద్దేశంతోనే విఘ్నేశ్ ఆమెకు ఫోన్ చేసి రప్పించాడని ఎస్పీ హర్షవర్ధన్ తెలిపారు. నిందితుడు కడప నుంచి వచ్చేటప్పుడు పెట్రోల్ బాటిల్ తన బ్యాగ్‌లో పెట్టుకొని వచ్చాడు. పక్క పథకం ప్రకారమే విఘ్నేష్ విద్యార్థిపై పెట్రోల్‌తో దాడి చేశాడు. గతంలో వీరద్దరూ ప్రేమించుకున్నారు. బాలిక పెళ్లి ప్రస్తావన తేవడంతో విఘ్నేష్ ఆమెను దూరం పెట్టాడు. ఆ తర్వాత మళ్లీ కలిశారు. శనివారం కూడా బాలిక పెళ్లి ప్రస్తావన తేవడంతో విఘ్నేశ్ ఈ దారుణానికి పాల్పడ్డాడు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా నిందితుడికి త్వరగా శిక్ష పడేలా చేస్తామని ఎస్పీ హర్షవర్ధన్ తెలిపారు.



## శాంతిభద్రతలపై మాటల యుద్ధం

2. నీ పాలనలో కోనసీమ జిల్లాలో 12 ఏళ్ల బాలికపై ఐదుగురు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. శ్రీకాకుళం జిల్లాలో 8 ఏళ్ల బాలికపై అత్యాచారం చేశారు. విజయవాడలో యువతిని 11 కత్తిపోట్లు పొడిచి చంపారు. నీ ఇంటి సమీపంలోని సీతానగరంలో యువతిపై అత్యాచారం జరిగితే కనీసం స్పందించలేదు. నీకు అసలు మాట్లాడే అర్హత ఉందా జగన్ ?

3. నీ 5 ఏళ్ళ పాలనలో, నీ ముఠా మొత్తం ఎస్సీ, ఎస్టీలపై ఇష్టానుసారంగా దాడులకు తెగబడ్డారు. ఎస్సీలు 192 మంది, ఎస్టీలు 58 మంది హత్యకు గురయ్యారు. మైనార్టీలపైనా దాడులకు పాల్పడ్డారు. అబ్దుల్ సలాం కుటుంబ ఘటన కంటే ఘోరమైన సంఘటన రాష్ట్రంలో మరొకటి ఉంటుందా. నరసరావుపేటలో వక్ఫ్ ఆస్తులు కాపాడాలని కోరిన ఇబ్రహీంను నడిరోడ్డుపై చంపారు. పలమనేరులో మిస్బా అనే 10వ తరగతి విద్యార్థిని చదువులో రాణించింది. వైకాపా నేత కూతురు కంటే ముందంజలో ఉందని వేధించడంతో ఆత్మహత్య చేసుకుంది. మైనారిటీ ఆడబిడ్డ కష్టపడి చదువుకోవడానికి కూడా స్వేచ్ఛ లేకుండా చేశారు. నువ్వు లా అండ్ ఆర్డర్ గురించి మాట్లాడుతున్నావా జగన్ ?

4. 'దిశ చట్టం' అంటూ లేని చట్టాన్ని ఉన్నట్లు ప్రచారం చేశావ్. దిశ చట్టంలో లోపాలున్నాయని కేంద్రం తిప్పి పంపితే, ఇక ఆ తర్వాత మళ్లీ దాని గురించి పట్టించుకోలేదు. లేని చట్టం పేరుతో పోలీస్ స్టేషన్లు పెట్టి యాప్ డౌన్‌లోడ్ చేయించారు. ఆడబిడ్డలపై అత్యాచారం చేస్తే దిశ చట్ట ప్రకారం ఉరిశిక్ష వేస్తామని చెప్పారు. ఒక్కరికైనా ఉరిశిక్ష పడిందా?ఎందుకీ అబద్ధపు బ్రతుకు జగన్ ?

5.రాష్ట్రంలో జరిగే ప్రతి నేరానికి, నువ్వు పెంచి పోషించిన గంజాయి మాఫియానే కారణం. దేశంలో ఎక్కడ గంజాయి దొరికినా మూలాలు ఏపీలోనే ఉండేలా నీ పాలన సాగింది. ఒక్కసారైనా గంజాయిపై సమీక్ష చేశావా? మేము రాగానే, గంజాయి రహిత రాష్ట్రంగా ఏపీని తయారు చేయటానికి అనేక చర్యలు తీసుకుంటున్నాం.

6. 201419 మధ్య రాష్ట్రంలో 14,770 ఆటోమేటిక్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. పోలీసులకు బాడీ వార్న్ కెమెరాలు పెడితే, నువ్వు రాగానే వాటిని మూల పడేసింది నిజం కాదా ? ఆటోమేటిక్ ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ విధానాన్ని నాశనం చేసింది నువ్వు కాదా? ఇవన్నీ నీ పార్టీలో ఉండే క్రిమినల్స్ దొరక్కుండా ఉండటానికి, నువ్వు వేసిన ఎత్తుగడలు కాదా?

7. కూటమి ప్రభుత్వం రాగానే, 5 ఏళ్ళ పాటు నువ్వు సమాజంలో నాటిన విష బీజాలు పీకి పడేసే పనిలో ఉంది. 120 రోజుల్లోనే అనేక కార్యక్రమాలు తీసుకొచ్చాం. ముందుగా గంజాయిపై దృష్టి పెట్టాం. దాని మత్తులో జరుగుతున్న నేరాలపై ఉక్కు పాదం మోపుతున్నాం. ఏ ఘటన జరిగినా వెంటనే చర్యలు తీసుకుని, నేరం చేసిన వాడిని అరెస్ట్ చేస్తున్నాం. కేసు తీవ్రతను బట్టి ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తున్నాం. సైకోలని కంట్రోల్‌లో పెట్టడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. అయినా కొన్ని దురదృష్టకర ఘటనలు జరుగుతున్నాయి. జరిగిన వెంటనే చర్యలు ఉంటున్నాయి. నీలా నిద్ర పోవటం లేదు

8. సీమలో నువ్వు, నీ కుటుంబం పెంచి పోషించిన ఫ్యాక్షనిజం అణిచివేసిన చరిత్ర సీఎం చంద్రబాబుది. సొంత పార్టీ నేతలను కూడా ఉపేక్షించకుండా అరెస్ట్ చేసిన చరిత్ర చంద్రబాబుది. నువ్వు, నీ కుటుంబం రౌడీలని పెంచి పోషిస్తే, రౌడీ అనే పేరు వినబడటానికే భయపడేలా పీడీ యాక్ట్ పెట్టి శిక్షించింది, మత కలహాలు లేకుండా చేసింది, తీవ్రవాదంపై పోరాడింది చంద్రబాబే. ఇప్పుడు కూడా గత 5 ఏళ్ళు నువ్వు పెంచి పోషించిన సైకోలని, రాష్ట్రం నుంచి తరిమి కొట్టి, సైకోల రహిత రాష్ట్రంగా చేసేది కూడా ఆయనే'' అని లోకేశ్ పేర్కొన్నారు.

# హర్యానా తప్పిదమే జార్ఖండ్‌లో..

## ఇండియా కూటమిలో విబేధాలు..?

జార్ఖండ్ ఎన్నికల వేళ ఇండియా కూటమిలో విబేధాలు క్రమంగా బయటపడుతున్నాయి. సీట్ల పంపకాలపై కాంగ్రెస్‌జేఎంఎం అనుసరించిన తీరుపై బాహాటంగానే ఆర్జేడీ అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇక ఈ వేడి తగ్గకముందే కాంగ్రెస్ జేఎంఎం మధ్య సీట్ల పంపకాలపై విబేధాలు భగ్గుమన్నాయి.



జయభేరి, న్యూఢిల్లీ:

ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ జేఎంఎం మరియు కాంగ్రెస్ 81 సీట్లలో 70 సీట్లను పోటీ చేస్తాయని, మిగిలినవి మిత్రపక్షాలకు వదిలివేస్తారని ప్రకటించారు. అయితే, ఆర్జేడీకి చెందిన మనోజ్ ఝా ప్రతిపాదించిన 1213 కంటే ఎక్కువ సీట్లు కోరుతూ, 1820 నియోజకవర్గాల్లో తమ ప్రభావాన్ని ప్రస్తావించారు. బీజేపీని ఓడించడమే లక్ష్యంగా ఇండియా బ్లాక్‌కు మద్దతుగా ఉన్నప్పటికీ, ఝా కొన్ని ప్రాంతాల్లో స్వతంత్రంగా పోటీ చేసే అవకాశం ఉందని సూచించారు, అయితే ఇతర చోట్ల ఇండియా కూటమికే మద్దతు ఇస్తామని వెల్లడించారు.

**సీట్ల కేటాయింపు వివాదం**

జేఎంఎం, కాంగ్రెస్ మధ్య విభేదాలు తీవ్రతరం అయ్యాయి, సోరెన్ జేఎంఎం కోటా నుండి ఆర్జేడీకి మరిన్ని సీట్లు ఇవ్వాలన్న కాంగ్రెస్ ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నట్లు సమాచారం.ఈ ప్రతిపాదన ముందనుకున్న ప్రణాళిక నుండి భిన్నంగా ఉండటంతో రెండు పార్టీల మధ్య విబేధాలు తలెత్తాయి. ఇందులో జేఎంఎం 50 సీట్లు పొందుతుంది, వాటిలో కొన్ని వామపక్ష పార్టీలకు ఉంటాయి మరియు కాంగ్రెస్ 31 సీట్లు పొందుతుంది, ఆర్జేడీ కాంగ్రెస్ వాటా నుంచి సీట్లు తమకు ఇవ్వాల్సిందిగా కోరుతోంది. జేఎంఎం నాయకులు ఆర్జేడీ డిమాండ్లపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఆర్జేడీకి కాంగ్రెస్ సీట్ల నుంచి కేటాయించాలని కోరారు. ఆర్జేడీ, కాంగ్రెస్ పార్టీలు జాతీయ పార్టీలని ఆ రెండు పార్టీలు సీట్ల పంపకాలపై చర్చించుకోవాలని అక్కడే పరిష్కరించుకోవాలి తప్ప, ప్రాంతీయ పార్టీ అయిన జేఎంఎంను సీట్లు డిమాండ్ చేయడం సరికాదన్నారు. ఇదంతా చూస్తుంటే 2020లో బిహార్‌లో జరిగిన ఎన్నికల చర్చలను గుర్తుకు తెస్తున్నాయి.

**నియోజకవర్గ సమస్యలు**

రాంచీ, భవనథ్పూర్ లాంటి కొన్ని నియోజకవర్గాల్లో బీజేపీ నుంచి జేఎంఎంలో చేరిన నేతలు సీట్లను ఆశిస్తుండటంతో పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారాయి.ఇది కాంగ్రెస్ శ్రేణుల్లో అసంతృప్తిని రాజేసింది. జేఎంఎం కూటమి సూత్రాలను అతిక్రమించి కాంగ్రెస్ కార్యకర్తలను నిరుత్సాహపరుస్తున్నదనే ఆరోపణలు ఉన్నాయి. ఉదాహరణకు అనంత్ ప్రతాప్ దేవ్, కాంగ్రెస్ నుండి బీజేపీలో చేరి తర్వాత జేఎంఎంలో చేరి టికెట్ ఆశిస్తున్నారు.

ఆర్జేడీ డిమాండ్ల కారణంగా జేఎంఎంకు 41 సీట్లు, కాంగ్రెస్‌కు 29 సీట్లు అనే ప్రారంభ ఒప్పందం ఇప్పుడు తారుమారైంది.కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం ఈ అంశాన్ని ఢిల్లీ పెద్దలకు చేర్చింది. ఈ విబేధాలు రావడంతో కాంగ్రెస్ 29 సీట్ల నుంచి 25కు తగ్గించుకున్నట్లు తెలుస్తోంది.

ఎన్నికలకు ముందు సీట్ల పంపిణీ ఒప్పందాలలో భాగస్వామ్య రాజకీయాలు చర్చల ప్రక్రియలలో సంక్లిష్టతలను ఎత్తి చూపుతోంది.ఈ వివాదాల పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నారు, ఎందుకంటే కూటమి భాగస్వాముల వివిధ డిమాండ్లను సమీకరించి వాటిని పరిష్కరించి ఒకటి రెండ్రోజుల్లో అభ్యర్థుల జాబితాలను విడుదల చేసే అవకాశాలున్నాయి.

> **ఆర్జేడీ డిమాండ్ల కారణంగా జేఎంఎంకు 41 సీట్లు, కాంగ్రెస్‌కు 29 సీట్లు అనే ప్రారంభ ఒప్పందం ఇప్పుడు తారుమారైంది.కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం ఈ అంశాన్ని ఢిల్లీ పెద్దలకు చేర్చింది. ఈ విబేధాలు రావడంతో కాంగ్రెస్ 29 సీట్ల నుంచి 25కు తగ్గించుకున్నట్లు తెలుస్తోంది.**

# చంద్రబాబు మ్యాజిక్..!



▶▶ మూడు రోజుల్లో మద్యం ద్వారా ఎంత ఆదాయం వచ్చిందో అంటే..?

మందు తాగని వాడు ఏమై పుడతాడో మహాకవి గురజాడ అప్పారావు గారు ఎక్కడా చెప్పలేదు. ఆయన పొగ తాగని వాడు దున్నపోతై పుట్టున్ అని చెప్పి వదిలేశారు. సో మందు విషయంలో ఎవరి చాయిస్ వారికి ఇచ్చేశారు అన్న మాట. అయినా సరే పోగతాగని వాడే దున్నపోతై పుడితే మందు తాగని వాడు ఇంకా ఎలా పుడతారో అన్న కంగారూ భయాలు ఉంటాయి కదా. తాము అధికారంలోకి వస్తే నాణ్యమైన మందుని ఇస్తామని విపక్షాలు ప్రామిస్ కూడా చేశాయి. ఇపుడు ఇస్తున్నాయి. ఈ నెల 16 నుంచి ఏపీలో కొత్త లిక్కర్ పాలసీ రూపంలో తెరచుకున్న మందు షాపులు మహా కిక్కే ఇస్తున్నాయి. అవి లక్ష్మీ కళతో ఉట్టిపడుస్తున్నాయి. మరి మద్యం ద్వారా ఆదాయం ఎలా వస్తోంది. అమ్మకాలు ఎలా సాగుతున్నాయన్న ఆసక్తి ఉంటుంది. మూడు రోజుల వ్యవధిలో జరిగిన మద్యం అమ్మకాలు ఏపీవ్యాప్తంగా చూసుకుంటే కనుక అక్షరాలా రూ. 541 కోట్ల రూపాయలు జరిగాయని లెక్కలు చెబుతున్నాయి. సగటున రోజుకు నూటాభై నుంచి రెండు వందల కోట్ల దాకా మద్యం అమ్మకాలు జరిగాయన్న మాట. దసరా పండుగ వెళ్లిపోయింది అయినా కొత్త సరదా పండుగగా మారి మద్యం దుకాణాలకు కాసుల పంట కురిపిస్తోంది అని అంటున్నారు. ఇక కేవలం మూడు రోజుల వ్యవధిలో 7,843 మంది మద్యం వ్యాపారులు స్టాక్ ని తీసుకుని వెళ్ళారు అని అంటున్నారు. స్టాక్ అయిపోయింది అని ఒక్కసారి కాదు రెండు మూడు సార్లు తీసుకెళ్ళిన వ్యాపారులూ ఉన్నారు అంటే కనుక ఏ విధంగా మద్యం సేల్ అవుతుందో ఊహించుకోండి అనే అంటున్నారు. ఇక కొత్త లిక్కర్ పాలసీని అమలు చేసిన తరువాత చూస్తే కనుక ఇప్పటి వరకూ 6 లక్షల 77 వేల 511 కేసుల లిక్కర్ అమ్ముడైందని ఎక్సైజ్ శాఖ అధికార వర్గాల లెక్కలు చెబుతున్నాయి. అంతే కాదు ఇందులో చూస్తే కనుక ఒక లక్షా 94 వేల 261 కేసుల బీర్లు అమ్మడయ్యాయని చెబుతున్నారు. ఇదే తీరున మద్యం ఊపు కొనసాగితే ఏపీకి కాసుల పంటే అని చెబుతున్నారు.

## చీఫ్ మినిస్టర్ కాదు.. చీటింగ్ మ్యాన్

పేదలకు ఇచ్చిన 420 హామీలు అమలు చేసేదాకా పోరాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు. బందిపోట్లను దొంగలను కొట్టినట్లు నిరుద్యోగులపై లాఠీ ఛార్జ్ చేయించారని హరీష్ రావు ఆరోపించారు. నిరుద్యోగులను నమ్మించి మోసం చేసిన రేవంత్ రెడ్డి.. ఏది మీ జాబ్ క్యాలెండర్? ఏవి 2 లక్షల ఉద్యోగాలు అని ప్రశ్నించారు. ధైర్యం ఉంటే రేవంత్ రెడ్డి సెక్యూరిటీ లేకుండా అశోక్ నగర్‌కు రావాలని సవాల్ విసిరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అన్యాయం జరిగేలా ఉన్న జీవో 29 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 6 గ్యారంటీలు అమలు చేయమంటే పైసల్ లేవ్ అంటున్న రేవంత్ రెడ్డి.. మూసీ సుందరీకరణకు లక్షా 50 వేల కోట్లు ఎక్కడివని హరీష్ రావు ప్రశ్నించారు. 6 గ్యారెంటీలను పక్కదారి పట్టించేందుకే మూసీ సుందరీకరణ పేరుతో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు. మూసీ సుందరీకరణకు అడ్డువస్తే బుల్డోజర్‌తో తొక్కిస్తామంటున్న రేవంత్ రెడ్డి.. చంపుతామన్నా, కేసులు పెడతామన్నా, అక్రమ అరెస్టులు చేస్తామన్నా.. బిఆర్ఎస్ భయపడదని స్పష్టం చేశారు.కరోనా కష్టకాలంలో ఖజానా ఖాళీ ఉన్న సమయంలో.. వానకాలం ఆరంభంలోనే కేసీఆర్ ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం అందించిందని.. హరీష్ రావు గుర్తుచేశారు. ఇప్పుడు కరోనా లాంటి కష్టం ఉందా? ఎందుకు రైతుబంధు ఇవ్వలేకపోతున్నారని ప్రశ్నించారు. ఎకరానికి 10 వేలు కాదు.. 15 వేలు ఇస్తామని, అసలుకే ఎసరు పెట్టారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పది మాసాలు గడిచినా.. పెన్షన్‌దారులకు కేవలం 8 నెలల ఇచ్చారని హరీష్ రావు వ్యాఖ్యానించారు. ఏ ఒక్క మాటను నిలబెట్టుకోలేదని విమర్శించారు. రైతులు పండించిన ప్రతి పంటకు బోనస్ ఇస్తామని చెప్పి.. అధికారంలోకి రాగానే కేవలం సన్న వడ్లకు, అదికూడా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకుంటేనే బోనస్ ఇస్తామంటున్నారని ఆక్షేపించారు. సన్న వడ్లకు ప్రభుత్వం ఇచ్చే బోనస్‌తో కలిపి క్వింటాల్‌కు రూ.2800 వస్తే.. బహిరంగ మార్కెట్లో 3 వేల రూపాయలు వస్తుందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో రైతులు సన్న వడ్లు అమ్ముకునే పరిస్థితి లేదన్నారు. సన్న వడ్ల బోనస్ కూడా గుండు సున్నా అవుతుందని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉరుకుందామా? కాంగ్రెసోళ్లను ఉరికిద్దామా.. అని పార్టీ శ్రేణులను ప్రశ్నించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ మహిళలకు అనేక హామీలు ఇచ్చింది. కానీ కేవలం ఆర్టీసీ బస్సుల్లో ఫ్రీ తప్ప.. అన్ని తుస్సే అయ్యాయని హరీష్‌రావు విమర్శించారు. లక్ష కోట్లు వడ్డీలేని రుణం అన్నారు.. కానీ 5 లక్షల వరకే ఇస్తున్నట్లు జీవో ఉందని తెలిపారు. బతుకమ్మ చీరలను రద్దు చేయడంతో పాటు.. ఆడబిడ్డలకు తులం బంగారం, నెలకు రూ.2500 నగదు గురించి ప్రస్తావన లేకుండా పోయిందన్నారు. పథకాల కేసీఆర్‌ను పోగొట్టుకుని.. ఫోటోలకు ఫోజులు ఇచ్చే రేవంత్ రెడ్డిని తెచ్చుకున్నామని ప్రజలు బాధపడుతున్నారని స్పష్టం చేశారు.

## జీవో నంబర్ 317పై నివేదిక ఇచ్చిన కేబినెట్ సబ్ కమిటీ..!



జీ.వో నంబర్ 317పై మంత్రి వర్గ ఉపసంఘం సీం రేవంత్ రెడ్డికి తుది నివేదిక అందజేసింది. ఈ జీవోను 2021 డిసెంబర్ లో తీసుకొచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే దీనిపై కేబినెట్ సబ్ కమిటీ వేశారు. ఈ మంత్రి వర్గ ఉపసంఘాన్ని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ నేతృత్వంలో మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ లు సభ్యులుగా ఏర్పాటు చేశారు. దీంతో పాటు ఆన్లైన్ ద్వారా ఉద్యోగుల అభిప్రాయాలను తీసుకుంది. ఈ జీవోపై సీఎం త్వరలోనే అనుకూల నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. డిసెంబర్ 2021లో GO 317 ఇచ్చారు. దీని ప్రకారం ఉద్యోగాల కేటాయింపులో జోనల్ వ్యవస్థను తీసుకొచ్చారు. 2016లో 10 నుంచి 31 కొత్త జిల్లాలుగా తెలంగాణ పునర్వ్యవస్థీకరించిన తర్వాత ఈ జీవో వచ్చింది. ఈ జీవో జిల్లా కేడర్ పోస్టులకు ఉద్యోగాలు, బదిలీలపై నిర్ణయం తీసుకునే కేటాయింపు కమిటీలో జిల్లా కలెక్టర్, సంబంధిత శాఖాధిపతులు ఉండడానికి అవకాశం కల్పిస్తుంది. జోనల్, మల్టీజోనల్ పోస్టుల కోసం, నిర్ణయం ప్రిన్సిపల్ సెక్రటరీ, స్పెషల్ చీఫ్ సెక్రటరీ, డిపార్ట్‌మెంట్ హెడ్, ప్రభుత్వ సీనియర్ కన్సల్టెంట్ సభ్యులుగా ఉండవచ్చు. భార్యాభర్తలు రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు వేర్వేరు కేడర్ల కింద పనిచేస్తుంటే, కేడర్ మార్పు కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఈ జీవో అవకాశం కల్పిస్తోంది. ఈ జీవో ప్రకారం సాధ్యమైనంత వరకు, భార్యాభర్తలు ఒక స్థానిక కేడర్‌లో ఉంచుతారు. ఆదివాసీ ఏజెన్సీ ప్రాంతంనిర్దిష్ట కేడర్ల కేటాయింపును GO పేర్కొనకపోవడంతో, ఉపాధ్యాయులతో పాటు, ఆదివాసీలు ఐదవ షెడ్యూల్ ప్రకారం ఆదివాసీలకు ఇచ్చిన రక్షణను పలుచన చేస్తారనే భయంతో ఆదివాసీలు ఈ జీవోపై నిరసన తెలిపారు.

# పేదింటి విద్యార్థులకు బిఎల్ఆర్ విద్యా దీవెన చెక్కులు

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, ఉప్పల్ :**

గత కొన్ని సంవత్సరాలుగా నియోజకవర్గంలోని పేదింటి విద్యార్థులకు ఆపన్న హస్తాన్ని అందిస్తూ. డాక్టర్ కావాలన్న కలలకు ఆర్థిక పరిస్థితులు అడ్డుగా ఉన్న వారిని అందరిని ఆదరిస్తూ వారికి ఐదు సంవత్సరాల MBBS చదువులకు ఉచితంగా ఫీజులు కడుతున్న గొప్ప నాయకుడు మన ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి. రామాంతపూర్ డివిజన్, గొఖలే నగర్ కు చెందిన నెల్లి విరోనికా, శ్రీరామ కాలనీకు చెందిన పల్లెపు వైష్ణవి నిరుపేద కుటుంబానికి చెందినవారు. స్వయంగా ఇంటివద్దకు వెళ్ళి చెక్కులను అందచేసిన శాసన సభ్యులు ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వీరిని ఆదర్శంగా తీసుకొని రామాంతపూర్ డివిజన్లోని ఇంకా చాలామంది విద్యార్థులు బాగా చదివి ర్యాంకులు సాధించాలన్నారు పేద విద్యార్థులకు అన్ని రకాలుగా నా సహాయ సహకారాలు ఉంటాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ గంథం జోత్స్నా నాగేశ్వరావు, రాష్ట్రనాయకులు ప్రభాకర్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు బాబు యాదవ్, పాల్వయి మధుసూదన్ రెడ్డి, సురం శంకర్, జహంగీర్, రాయసహాయం శ్రీనివాస్ రెడ్డి, చాంద్ పాషా, బోసాని పవన్, ప్రశాంత్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, రాజు యాదవ్, వెంపటి శ్రీనివాస్, మహేందర్, మందపాటి శ్రీనివాస్ రెడ్డి, మద్దూరి శ్రీనివాస్, లక్ష్మి, విజయలక్ష్మి, చేగురి శ్రీను, అనంద్, టోనీ, కాలనీవాసులు బంధువులు పాల్గొన్నారు.





# అనుమతులుంటే.. కూల్చం..!

- సీఎం ఆదేశాలను అమలు చేస్తాం
- హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రకటన
- ముఖ్యమంత్రి ప్రకటన నేపథ్యంలో స్పష్టత
- అనుమతుల్లేని వాటినే కూల్చామని వెల్లడి

**జయభేరి, హైదరాబాద్, అక్టోబరు 20:**

భవన నిర్మాణాలకు సంబంధించిన సంస్థల నుంచి అనుమతి (చెల్లుబాటయ్యే అనుమతి) తీసుకొని చేపట్టిన నిర్మాణాలను కూల్చివేయమని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. అన్ని రకాల అనుమతులు పొంది నిర్మించిన నిర్మాణాలకు కూల్చివేతల భయం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం చేసిన వ్యాఖ్యలపై హైడ్రా కమిషనర్ స్పష్టతనిచ్చారు. ముఖ్యమంత్రి ఆదేశాలకు హైడ్రా కట్టుబడి ఉందని ఆదివారం ఓ ప్రకటన చేశారు. చెరువుల పక్కనున్న నిర్మాణాలను హైడ్రా కూల్చివేస్తుందని సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం జరుగుతుండడంతో కొనుగోలుదారులు ఆందోళనకు గురువుతున్నారని పేర్కొన్నారు.

ఇప్పటిదాకా హైడ్రా కూల్చేసిన నిర్మాణాలన్నీ అనుమతులు లేకుండా నిర్మించినవేనని చెప్పారు. దుండిగల్, మల్లంపేట, అమీన్‌పూర్‌లో అనుమతులు ఇచ్చిన అనంతరం అవి ప్రభుత్వ స్థలాలని తెలిసి వాటిని రద్దు చేశారని, కానీ డెవలపర్లు నిర్మాణాలు చేపట్టి విక్రయించడంతో కూల్చివేశామని వివరించారు. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, పార్కులు, ప్రభుత్వ స్థలాల్లో ప్రజలు నివసిస్తోన్న భవనాల జోలికి వెళ్లమని గతంలోనే చెప్పామని గుర్తు చేశారు. సీఎం ఆదేశాల నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో చెల్లుబాటయ్యే అనుమతులతో నిర్మిస్తోన్న భవనాలను ఇక నుంచి కూల్చేది లేదని పేర్కొన్నారు. అనుమతులు లేకుండా చేపడుతోన్న నిర్మాణాల విషయంలో మాత్రం చట్ట ప్రకారం వ్యవహరిస్తామని స్పష్టం చేశారు.

చెరువులు, పార్కులు, ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలకు ప్రభుత్వ విభాగాలు ఇకపై అనుమతులివ్వకుండా చూస్తామని, కొత్త నిర్మాణాలు రాకుండా నిఘా పెడతామని తెలిపారు. అక్రమ నిర్మాణాలకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులపై ప్రాథమిక విచారణ జరుగుతోందని, సమగ్ర వివరాల సేకరణ అనంతరం తదుపరి చర్యలుంటాయని రంగనాథ్ చెప్పారు. కాగా, చెరువులు, ప్రభుత్వ స్థలాల్లో హైడ్రా కూల్చివేసిన భవనాల్లో అధిక భాగం డెవలపర్లు నిర్మించి సాధారణ పౌరులకు విక్రయించినవే. ఇందులో కొన్ని అనుమతులు ఉన్నవి కాగా.. ఇంకొన్ని అనుమతులిచ్చి అనంతరం రద్దు చేసినవి. కొన్ని నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు లేవు.

ఇందులో అనుమతులున్న భవనాలను హైడ్రా కూల్చివేయడంతో సామాన్యులు తీవ్రంగా నష్టపోయారు. అయితే, చెరువుల వద్ద ఉన్నా అనుమతులుంటే ఆ నిర్మాణాలను కూల్చమని హైడ్రా తాజాగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో గతంలో పర్మిషన్ ఉన్నా కూల్చివేతలు చేపట్టడంతో నష్టపోయిన సామాన్యుల పరిస్థితి ఏంటి ? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. నిజానికి ఏదైనా నిర్మాణానికి అనుమతులిచ్చి రద్దు చేస్తే... నిర్మాణ పనులు జరగకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులదే. కానీ, నిర్మాణదారులతో కుమ్మక్కైన అధికారులు అటు వైపు కన్నెత్తి చూడలేదు. దీంతో అనుమతుల రద్దు సంగతి తెలియక, పాత పత్రాలను చూసి ఇళ్లు కొనుగోళ్లు చేసిన వారు ఇప్పుడు నష్టపోయారు. ఈ బాధితుల అంశంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాల్సి ఉంది.

# ముదిరాజుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, కాప్రా :**

తన దృష్టికి వచ్చిన ముదిరాజ్ కులస్థుల సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు. చర్లపల్లి సిరి గార్డెన్ లో జరిగిన కుషాయిగూడ ముదిరాజుల అలయ్ బలాయ్ కార్యక్రమంలో మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ తో కలిసి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ముదిరాజ్ భవన్ నిర్మాణానికి తప్పకుండా కృషి చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నీలం మధు, సార అనిల్ నర్సింహ ముదిరాజ్ కులస్తులు తదితరులు పాల్గొన్నారు.



# సీసీ రోడ్ పనుల శంకుస్థాపన

- అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్, చిలకనగర్ డివిజన్ : ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల

**జయభేరి, ఉప్పల్ :**

చిల్కానగర్ డివిజన్ లోని శ్రీనగర్ కాలనీలో, ప్రశాంతనగర్ కాలనీలో సుమారు 63 లక్షల రూపాయల వ్యయంతో సిసి రోడ్డు పనులకు శంకుస్థాపనకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్థానిక కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్. అనంతరం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. చిల్కానగర్ డివిజన్లో దశలమారిగా అభివృద్ధి పనులు చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని సిసి రోడ్డు నిర్మాణంలో భాగంగా స్వీవరగే లైన్ పనులను కూడా చేపడతామని తెలిపారు. అనంతరం కార్పొరేటర్ గీతా ప్రవీణ్ మాట్లాడుతూ.. చిల్కానగర్ డివిజన్లోని అన్ని ప్రాంతాలకు సమయం చేస్తున్నామని శ్రీనగర్ కాలనీలో మరియు ప్రశాంత్ నగర్ కాలనీలో సీవరేజ్ పనులను కూడా వెంటనే చేపట్టి సిసి రోడ్లను పూర్తి చేసుకుంటున్నామని అన్నారు. లోతట్టు ప్రాంతమైన శ్రీనగర్ కాలనీ ఇంకా కొన్ని సిసి రోడ్లు స్ట్రాం వాటర్ డ్రైన్ మరియు స్వీవరగే లైన్లో వేయవలసిన అవసరం ఉన్నదని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రత్యేక చొరవ తో చిల్కానగర్ డివిజన్ కు నిధులు వస్తున్నందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు కార్పొరేటర్ గీత ప్రవీణ్ తెలిపారు. కార్యక్రమంలో శ్రీనగర్ కాలనీ అధ్యక్షులు కొండల్, ప్రశాంత్ నగర్ కాలనీ అధ్యక్షులు డాక్టర్ విజయ మోహన్, వారి కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మహిళ నాయకురాలు



# తన దృష్టికి తెచ్చిన సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తా..

- కాకతీయ కాలనీ ఫేజ్2 ముఖద్వారాన్ని ప్రారంభించిన కొత్త రవిగౌడ్

**జయభేరి, మేడిపల్లి :**

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చెంగిచెర్ల రెండవ డివిజన్ కాకతీయ కాలనీ పేజ్ 2 అధ్యక్ష కార్యదర్శుల, కమిటీ సభ్యుల అభ్యర్థన మేరకు తన సొంత నిధులతో కాలనీ ముఖ ద్వారాన్ని ఏర్పాటు చేసి, ముఖ ద్వారం వద్ద కొబ్బరి కాయ కొట్టి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన చెంగిచెర్ల మాజీ ఉపసర్పంచ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొత్త రవి గౌడ్. అనంతరం కాలనీలో పర్యటిస్తూ కాలనీ సభ్యులు తన దృష్టికి తెచ్చిన సిసి రోడ్డు, డ్రైనేజీ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని కొత్త రవి గౌడ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు బీతోజు భాస్కర్ చారి, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, గౌరవ అధ్యక్షులు కేదారి, ఉపాధ్యక్షులు సత్యనారాయణ, కోశాధికారి రామ్ చరణ్, కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబెర్స్, శ్రీనివాస్ రెడ్డి, మహేందర్, అజయ్, విక్రమ్, భాస్కర్, గిరిధర్, సిద్దులు, రంజిత్, మహేందర్, రామ్మూర్తి, విజయానంద్, కాలనీ మహిళలు, అనురాధ, విమల, పద్మ తదితరులు పాల్గొన్నారు.








# వైభవంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ట

- తునికి ఖాల్సా ప్రజలపై పెద్దమ్మ తల్లి ఆశీస్సులు ఉంటాయి
- సిద్దిపేట ఎమ్మెల్యే,మాజి మంత్రి హరీష్ రావు

**జయభేరి, గజ్వేల్, అక్టోబర్ 20:**

వర్గల్ మండలం తునికి ఖాల్సాలో ఆదివారం జరిగిన శ్రీ పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో మాజీ మంత్రి హరీష్ రావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు ఆయనకు ఆశీర్వచనాలు అందజేయగా, ముదిరాజ్ సంఘ అధ్యక్షులు జెల్ల మల్లేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. శ్రీ పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో ప్రతి ఒక్కరికి మంచే జరగాలని హరీష్ రావు ఆకాంక్షించారు. అలాగే శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, ఎఫ్డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి, ముదిరాజ్ మహాసభ వైస్ చైర్మన్ కొట్టాల యాదగిరి ముదిరాజ్ తదితరులు ప్రతిష్టా మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కాగా మొదటగా మండల పార్టీ అధ్యక్షులు వేలూరి వెంకట్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి బాలు యాదవ్, యువజన విభాగం అధ్యక్షులు నాగరాజు తదితరులు మాజీమంత్రి హరీష్ రావు స్వాగతం పలికారు.

# రైతును ఆగం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమా..!

- ఉమ్మడి మెదక్ డిసిసిబి డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి..
- రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు జుబేర్..



**జయభేరి, గజ్వేల్ ములుగు, అక్టోబర్ 20:**

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రైతులకు రైతు భరోసా వెంటనే చెల్లించాలని ఉమ్మడి మెదక్ జిల్లా డిసిసిబి డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి, తెలంగాణ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షులు జుబేర్ పాషాలు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఆదివారం గజ్వేల్ నియోజకవర్గం ములుగు మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో రాజీవ్ రహదారిపై రాస్తారోకో చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాను ఎగవేసి రైతులను మోసం చేయాలని చూస్తున్నారన్నారు. ఇచ్చిన హామీ మేరకు రైతులకు వెంటనే రైతు భరోసా చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజి జెడ్పీటీసీ అర్జున్ గౌడ్, మాజీ ఎంపిటిసిల ఫోరం అధ్యక్షులు లింగరెడ్డి, సీనియర్ నాయకులు, అన్ని గ్రామాల సర్పంచ్లు, సోషల్ మీడియా విభాగం కొమ్ము నవీన్ తదితరులు పాల్గొన్నారు

# పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడి

- గజ్వేల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ బి. సైదా



**జయభేరి, గజ్వేల్, అక్టోబర్ 20 :**

గజ్వేల్ పోలీస్ స్టేషన్ కు పరిధిలోని బయ్యారం గ్రామ శివారు నక్కకీర్తి గంగాధర్ మేకల షెడ్డులో కొంతమంది వ్యక్తులు కలసి పేకాట ఆడుతున్నారని నమ్మదగిన సమాచారంపై సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీసులు, గజ్వేల్ పోలీసులు వెళ్లి రైడ్ చేశారు. ఆరు మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి 34,370/ వేల రూపాయలు, 2 మోటార్ సైకిల్లు, 2 కార్లు, 6 మొబైల్ ఫోన్లు, స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడిన వారిలో గజ్వేల్ పట్టణం చెందిన నక్కకీర్తి గంగాధర్, నివాసం బెజగం, గజ్వేల్ కి చెందిన వారిలో ఎన్. సంతోష్ కుమార్, ఏలూరి భాగయ్య, బుద్దురి దయాకర్, ఉప్పల గౌరయ్య, కంసారం వెంకటేష్, దౌల్తాబాద్. ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ అధికారులు, గజ్వేల్ ఇన్స్పెక్టర్ సైదా మాట్లాడుతూ.. గ్రామాలలో, పట్టణాలలో ఫామ్హౌస్ లలో, ఇళ్ళల్లో పేకాట, బహిరంగ ప్రదేశంలో జూదం మరే ఇతర చట్టవ్యతిరేకమైన కార్యక్రమాలు ఎవరైనా నిర్వహిస్తున్నట్లు తెలిస్తే లేదా ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నటు సమాచారం ఉంటే వెంటనే సిద్దిపేట టాస్క్ ఫోర్స్ అధికారుల నెంబర్లు 8712667445, 8712667446, 8712667447 లకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు.

# తూర్పు తీర రాష్ట్రాలకు తుపాను హెచ్చరిక

**జయభేరి, విశాఖపట్నం:**

తూర్పు తీర రాష్ట్రాలకు తుపాను ముప్పు పొంచి ఉంది. బంగాళాఖాతంలో సోమవారం ఏర్పడనున్న అల్పపీడనం.. మంగళవారం నాటికి వాయుగుండంగా, బుధవారానికి తుపానుగా రూపాంతరం చెందుతుందని వాతావరణశాఖ వెల్లడించింది. దీని ప్రభావం ఒడిశా, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలపైనే ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. తుపాను భువనేశ్వర్ వద్ద లేదా పశ్చిమబెంగాల్.. బంగ్లాదేశ్ మధ్యలో తీరం దాటే అవకాశముంది. తుపాను ప్రభావం రాష్ట్రంపై ఎంత మేరకు ఉంటుందో ఇప్పుడే చెప్పలేమని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు. అల్పపీడనం ప్రభావంతో గురువారం నుంచి శనివారం వరకు ఉత్తర కోస్తాలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం సంచాలకులు స్టెల్లా పేర్కొన్నారు. సముద్రం అలజడిగా మారనున్న నేపథ్యంలో గురువారం వరకు మత్స్యకారులు వేటకు వెళ్లరాదని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ సూచించారు.

# ఏఈవోల ఆత్మీయ సమ్మేళనం

- ఏఈవో ల సమస్యల సాధన కోసం అడ్ హాక్ కమిటీ ఏర్పాటు
- ఏఈవో ల సమస్యల సాధన కోసం ప్రభుత్వం పనిచేయాలని వినతి

**జయభేరి, అక్టోబర్ 20:**



ఏఈవో ల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధతో పనిచేయాలని కోరారు. వ్యవసాయ శాఖలో ప్రస్తుతం పని చేస్తున్న 2600 మంది వ్యవసాయ విస్తరణ అధికారులలో 2100 మంది 2017, 2018 సంవత్సరాలలో నియమితులై ఏడు సంవత్సరాల సర్వీసులు విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా శామీర్ పేట్ మండలం తుంకుంట లో రాష్ట్రవ్యాప్త ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి ఏఈవోలు భారీ సంఖ్యలో హాజరయ్యారు . ఈ సందర్భంగా గత 7 సంవత్సరాలలో తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ శాఖ తరపున అమలు చేసిన వివిధ ప్రతిష్టాత్మక పథకాలను విజయవంతంగా అమలు చేసినట్టు వారు వెల్లడించారు . గత ఏడు సంవత్సరాల కాలంలో క్షేత్రస్థాయిలో ఎదురైన చేదు అనుభవాలను, అలాగే కష్టనష్టాల గురించి చర్చించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖలో ప్రతి 5000 ఎకరాలకు ఒకటి చొప్పున వ్యవసాయ క్లస్టర్లను ఏర్పాటు చేసినట్టు చెబుతున్నప్పటికిని క్షేత్రస్థాయిలో వాస్తవాలు వేరేలా ఉన్నాయని తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేయాలని ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా కూడా ఎలాంటి ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. రానున్న కాలంలో తమ సమస్యల సాధన కోసం పోరాటాన్ని ఉధృతం చేయాలని తీర్మానం చేసి రాష్ట్రస్థాయిలో కార్యాచరణ కొరకు వారు ఒక రాష్ట్రస్థాయి అడ్ హాక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ రాష్ట్రస్థాయి అడ్ హాక్ కమిటీకి చైర్మన్ గా రాజ్ కుమార్ బాదావత్ , కన్వీనర్లుగా పంజాల రాజు, కల్లేపల్లి పరశురాం, బందేల సుమన్, కళ్యాణి లతోపాటుగా 32 జిల్లాల నుంచి జిల్లా కమిటీ బాధ్యులు కోకన్వీనర్లును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖలో విస్తరణ అధికారులు తీవ్రమైన నిరాశ నిస్పృహలతో పనిచేస్తున్నట్లుగా తెలిపారు. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి సూచనల మేరకు భారతదేశంలో వ్యవసాయ విస్తరణ విజయవంతంగా ముందుకు వెళ్లాలంటే గ్రామస్థాయిలో ప్రతి 750 నుండి 1000 మందికి ఒకరి చొప్పున అగ్రికల్చర్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ ఉండాలని కమిటీ సిఫార్సు చేసిందనీ, కానీ దీనికి విరుద్ధంగా తెలంగాణ రాష్ట్రంలో సుమారుగా 6 నుండి 8 గ్రామాలకు, 7000 నుండి 12,000 మంది రైతులకు ఒక్క ఏఈఓ మాత్రమే ఉన్నట్టు తెలిపారు. గత రాష్ట్ర ప్రభుత్వం సుమారు 600 కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి నిర్మించిన రైతు వేదికల్లో సరైన యాజమాన్యం చేసే అటెండర్లు లేక అతికొద్ది కాలంలోనే శిథిలావస్థకు చేరుకునున్నట్లు తెలిపారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం రైతు వేదికలలో సుమారు 5 లక్షల రూపాయలు వేచించి రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ యూనిట్లను ఏర్పాటు చేసి రాష్ట్రవ్యాప్తంగా ప్రతి మంగళవారం వ్యవసాయ శాస్త్రవేత్తలకు, రైతులకు మధ్య ముఖాముఖి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అలాగే నిరంతరం రైతు వేదికలలో ఏదో ఒక సభలు సమావేశాలు జరుగుతూ ఉంటాయి. ఈ సభలు సమావేశాలలో సభా స్థలం ఏర్పాటు చేయడం, కుర్చీలు వేయడం, సర్దడం, మొదలు రైతు అధికారులు పరిశుభ్రంగా ఉంచడంలో ఏఈఓ లకు చేదోడు వాదోడుగా ఉండేందుకు అటెండర్లను నియమించకపోవడం వల్ల రైతు వేదికలలో సమావేశాలు నిర్వహించినపుడల్లా ఏఈవోలు తీవ్రమైన అసౌకర్యానికి గురవుతున్నట్లుగా పలుమార్లు వ్యవసాయ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టుగా తెలిపారు. అలాగే గ్రామస్థాయిలో ఎలాంటి సహాయకులు లేకుండా ఎన్నో కష్టాలకోర్చి 8 నుండి 10 గ్రామాలలో సుమారు 49 రకాల విధులను నిర్వర్తిస్తూ తీవ్రమైన పనిభారాన్ని మోస్తున్నామని, ఇప్పటికైనా వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు ప్రతీ రైతు వేదికకు ఒక అటెండర్ ను నియమించడంతోపాటు భారత వ్యవసాయ మండలి సూచనల మేరకు ప్రతి గ్రామానికి ఒక గ్రామ వ్యవసాయ సహాయకులను నియమించి తెలంగాణలో వ్యవసాయ శాఖను గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం ముందడుగు వేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన డిజిటల్ క్రాప్ సర్వే ను కేంద్ర ప్రభుత్వ యొక్క మార్గదర్శకాలకు అనుగుణంగానే గ్రామస్థాయిలో లోకల్ యూత్ ద్వారా కానీ ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా గాని పంటల సర్వే చేపిస్తే వ్యవసాయ శాఖ తరపున సర్వేను 100% విజయవంతం మానిటర్ చేస్తామని ప్రభుత్వానికి హామీ ఇచ్చారు. వ్యవసాయ శాఖలో ఔట్ సోర్సింగ్ ఏఈఓ లను ఉన్నతాధికారులు వేధించడం ఆపాలని ఈ సందర్భంగా ఉన్నతాధికారులను వారు వేడుకున్నారు. డిజిటల్ క్రాప్ సర్వే విషయంలో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు వ్యవసాయ విస్తరణ అధికారులతో శాంతియుత వాతావరణంలో చర్చలు జరిపి, డిజిటల్ క్రాప్ సర్వేను తెలంగాణ రాష్ట్రంలో విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు.



# పెద్దమ్మ తల్లి ప్రతిష్టలో పాల్గొన్న నీలం మధు

- స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ శ్రేణులు సత్తా చాటాలి
- కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను కడుపులో పెట్టుకొని కాపాడుకుంటాం
- డిసిసి అధ్యక్షులు నర్సారెడ్డి తో కలిసి శ్రీ పెద్దమ్మతల్లి క్షేత్రంలో ప్రత్యేక పూజలు
- మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్

**జయభేరి, గజ్వేల్ వర్గల్, అక్టోబర్ 20 :**



కష్టపడి పార్టీ కోసం శ్రమించే కార్యకర్తలను కడుపులో పెట్టుకొని కాపాడుకుంటామని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ పేర్కొన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం తునికి ఖాల్సాలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డితో కలిసి శ్రీ పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజల అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. శ్రీ పెద్దమ్మ తల్లి ఆశీస్సులు, చల్లని చూపు సీఎం రేవంత్ రెడ్డితో పాటు రాష్ట్ర ప్రజలపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు. గత పాలకులు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేయగా, సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక కృషితో ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీకి కట్టుబడి పనిచేస్తున్నట్లు స్పష్టం చేశారు. ప్రజలను తప్పుదోవ పట్టించడమే లక్ష్యంగా బిఆర్ఎస్, బిజెపి పార్టీలు కుట్రలు పన్నుతుండగా, ప్రజల సంపూర్ణ ఆశీస్సులు, వారి అండతో కాంగ్రెస్ ప్రభుత్వం చారిత్రాత్మక, సాహసోపేత నిర్ణయాలతో ముందుకెళుతున్నట్లు చెప్పారు. ఆలాగే కాంగ్రెస్ పార్టీకి పటిష్ట నాయకత్వం ఉండగా, వారి అండతో రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటి సర్పంచ్ మొదలు జెడ్పిటిసి, ఎంపీటీసీ, ఎంపీపీ, జెడ్పీలను కైవసం చేసుకుంటుందని దీమా వ్యక్తం చేశారు. ముఖ్యంగా కష్టపడిన పార్టీ కార్యకర్తలకే నామినేటెడ్ పోస్టుల భర్తీలో సీఎం రేవంత్ రెడ్డి ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు శ్రీరామ్ నర్సింలు ముదిరాజ్, గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు జెల్ల మల్లేశం ముదిరాజ్, మాజీ ఎంపీపీలు మోహన్, విద్యా కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సందీప్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ గొడుగు జనార్ధన్, నాయకులు కొండల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, జింక మల్లేశం, ప్రవీణ్ గౌడ్, శివారెడ్డి, నర్సింహారెడ్డి, గోవర్ధన్ రెడ్డి, బాల్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, సాయికిరణ్ గౌడ్, కొండగళ్ల గణేష్, భరత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# మజీద్ పూర్ గ్రామంలో విషాదం

- ఉరి వేసుకుని బీటెక్ విద్యార్థి ఆత్మహత్య
- కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న పోలీసులు

**జయభేరి, అక్టోబర్ 20:**

ఇంటి నుంచి వెళ్లిపోయిన ఓ యువకుడు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మేడ్చల్ జిల్లా మజీద్ పూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వినయ్ రాజ్ (23) బీటెక్ పూర్తి చేశాడు. కాగా ఆదివారం మధ్యాహ్న సమయంలో ఇంట్లో చెప్పకుండా బైక్ పై బయటకు వెళ్ళిపోయాడు. అయితే ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో అతని తండ్రి గ్రామంలో వెతికి చివరికి తన పొలం వద్దకు వెళ్లగా అక్కడ వినయ్ రాజ్ బైక్ కనబడింది. వెంటనే సమీప ప్రాంతంలో చూడగా హనుమల్ల కుంట పక్కన ఉన్న చెట్టుకి కరెంట్ కేబుల్ వైర్ తో ఉరి వేసుకుని కనిపించాడు. దీంతో తండ్రి ఒక్కసారిగా నిశ్చేష్టుడయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు కన్నీరు మున్నీరుగా విలపించారు. అయితే వినయ్ రాజ్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ మేరకు శామీర్ పేట్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# రోడ్డు ప్రమాదం మహిళ మృతి

**జయభేరి, అక్టోబర్ 20:**

అదుపు తప్పి ద్విచక్ర వాహనం బోల్తాపడి ఓ మహిళ మృతి చెందగా మరో ముగ్గురు గాయపడ్డారు. ఈ సంఘటన మేడ్చల్ జిల్లా లాల్ గడి మలక్ పేట్ సమీపంలో చోటు చేసుకుంది. జగిత్యాల జిల్లా పైడిపల్లి గ్రామానికి చెందిన కుమార్ అతని భార్య సంధ్య (26), అతని కుమారుడు కౌశిక్ (2), మరియు అతని బావ మరిది ప్రవీణ్ కలిసి తన ద్విచక్ర వాహనంపై గ్రామం నుంచి హైదరాబాద్ కు బయలుదేరారు. వీరి వాహనం లాల్ గడి మలక్ పేట్ ట్రక్ లే బే సమీపంలోకి రాగానే ఓ గేదే అడ్డు రావడంతో ఒక్కసారిగా కుమార్ బ్రేక్ వేశాడు. దీంతో బైక్ అదుపు తప్పి కింద పడడంతో బైక్ వెనుక కూర్చున్న సంధ్య తలకు మరియు ముఖంపై బలమైన గాయాలు కావడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. బైక్ నడుపుతున్న కుమార్ మరియు అతని కుమారుడు కౌశిక్ మరియు బావ మరిది ప్రవీణ్ కు గాయాలు కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు జీనోమ్ వ్యాలీ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం సుభిక్షం

- గుండ్లపోచంపల్లి బీజేపీ సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఎంపీ ఈటల

**జయభేరి, మేడ్చల్ :**



ముత్యాలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన విషయంపై చర్యలు తీసుకోకడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం గుండ్ల పోచంపల్లి అపర్ణ కేనోపిలో నిర్వహించిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఈటల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే మేడ్చల్ నియోజకవర్గం మొదటి స్థానంలో ఉందన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వం బలంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని భావించి ప్రజలందరూ స్వచ్ఛందంగా సభ్యత్వ నమోదు చేసుకుంటున్నట్లు ఈటల తెలిపారు. హైదరాబాద్ లో అల్లరిమూకల దాడులను అరికట్టడంలో రాష్ట్రప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం జరిగి వారంరోజులు గడుస్తున్నా ఇంతవరకు చర్యలు తీసుకోలేదన్నారు. దీనిపై ప్రశాంతంగా నిరసన తెలుపుతున్న హిందువులపై లాఠీచార్జి చేయడం హేయమైన చర్య అన్నారు. ఈ రెండు నెలల కాలంలో ఆరు గుళ్లు ధ్వంసం చేశారని, ఇంత వరకు ప్రభుత్వం పట్టించుకోకపోవడం దురదృష్టం అన్నారు. హైదరాబాద్ బాంబు పేలుళ్ళు ఇప్పుడిప్పుడే తెరుకుంటుందని, ప్రధాని మోదీ టెర్రరిజం మీద, ఉన్మాదుల మీద ఉక్కుపాదం అనివేచరని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉన్మాదులను ప్రపంచంలో ఎక్కడ ఉన్నా వదిలి పెట్టం అని హెచ్చరించారు. ఉన్మాదులను పెంచి పోషించడం పాముకు పాలు పోసి పెంచడమే అని సర్వేజనా సుఖినో భవంతు అని చెప్పే మన ధర్మం మీద దాడి చేయడం దుర్మార్గం అన్నారు. ముత్యాలమ్మ ఆలయం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం స్పందించక పోతే కేంద్రం ఇన్వాల్వ్ కావలసి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్ రెడ్డి, కౌన్సిలర్లు దొడ్ల మల్లికార్జున్, అమరం సరస్వతీ, మున్సిపల్ అధ్యక్షుడు ఉషిగారి శ్రీనివాస్, నాయకులు క్రిష్ణగౌడ్, కిషన్, అశోక్, కృష్ణ, శ్రీధర్, నవీన్, విక్రమ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



# రహదారికి ఇరువైపుల పిచ్చి మొక్కలు తొలగింపు

**జయభేరి, పరవాడ:**

అనకాపల్లి జిల్లా పరవాడ మండలం లో నాయుడుపాలెం పంచాయితీలో నాయుడుపాలెం సర్పంచ్ వరలక్ష్మి సీతారామయ్య దంపతులు ఆధ్వర్యంలో నాయుడుపాలెం గ్రామము నుండి, మెట్టపాలెం జంక్షన్ మీదగా కండి పల్లి పైడయ్య జంక్షన్, పల్లి వాణి కొంపలు మీదగా హస్తినాపురం గ్రామం వరకు కండిపల్లి పైడయ్య జంక్షన్ మీదగా గంగు నాయుడుపాలెం గ్రామం వరకు వాహనాదారులకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు,చిన్న చిన్న పుట్టలు,కంచి తుప్పలు,చిన్న చిన్న తాటి చెట్లు, తీయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర బీసీ అధ్యక్షులు, కే కృష్ణం నాయుడు,కన్నూరు తాత బాబు,కొండ్రపు బుజ్జి, నాని, దేవుడు తదితరులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ దొంగ హామీలతో రైతుల మోసం చేస్తుంది



**జయభేరి, మేడ్చల్ :**

రైతులను ఆదుకుంటామని దొంగ గ్యారెంటిలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు పంట పెట్టుబడి సాయం అందించకుండా మోసం చేస్తోందని బిఆర్ఎస్ మేడ్చల్ పట్టణ అధ్యక్షుడు భాస్కర్ యాదవ్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు పంట పెట్టుబడి సాయం అందించడంలో జాప్యం చేయడాన్ని నిరసిస్తూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు మేడ్చల్ పట్టణంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రైతులకు అనేక ఉచిత హామీలు ఇచ్చి అధికారంలోకి రాగానే మోడిచేయి చూపిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ వైస్ ఛైర్మన్ మధుకర్ రెడ్డి, మేడ్చల్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దయానంద్ యాదవ్, మేడ్చల్ మున్సిపాలిటీ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు భాస్కర్ యాదవ్, మేడ్చల్ మండల బిఆర్ఎస్ పార్టీ యూత్ ప్రెసిడెంట్ హరత్ రెడ్డి, బి ఆర్ టి యూ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు సంబు ప్రభాకర్, మేడ్చల్ మన్సిపాలిటీ కౌన్సిలర్ తుడుం గణేష్, డబిల్ పూర్ పిఏసిఎస్ ఛైర్మన్ సురేష్ రెడ్డి, మాజీ సర్పంచ్ లు, మాజీ ఎంపిటిసిలు, నాయకులు పాల్గొన్నారు.

# రైతులకు ఇవ్వవలసిన వర్షా కాలం రైతు భరోసా

- ఎకరానికి 15 వేల రూపాయలు ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం
- బి ఆర్ఎస్ పార్టీ మాజీ సర్పంచ్ల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు జరుపుల లోక్య నాయక్



**జయభేరి, చందంపేట :**

చందంపేట మండల కేంద్రంలో రాస్తారోకో ధర్నా సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎక్స్ జెడ్పిటిసి బోయపల్లి శ్రీనివాస్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి శంకర్ నాయక్, సత్యనారాయణ గౌడ్, మాజీ,ఎంపీటీసీ బాలవర్ధిరాజు, మండల నాయకులు, గోసల శివ, తిరుపతయ్య, శంకర్ నాయక్, తరి గోవర్ధన్, అందుగుల సైదులు, హనుమత్ రెడ్డి, రామ్ కోటి, బలరాం, దామెర శ్రీను, తదితర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కమిటీ హాల్ కు భూమి పూజ



**జయభేరి, మేడిపల్లి :**

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ లోని 24వ డివిజన్లో గణేష్ నగర్ కాలనీలో కమిటీ హాల్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా స్థానిక కార్పొరేటర్ గుర్రాల రామా వెంకటేష్ యాదవ్ భూమి పూజ చేశారు. గణేష్ నగర్ కాలనీ ఏర్పడినప్పటి నుంచి కాలనీలో అతిపెద్ద సమస్య కమిటీ హాల్ లేకపోవడంతో ఏలాంటి మీటింగ్ లైనా రోడ్లపైనే పెట్టుకోవడం జరిగేది. ఎంతమంది నాయకులు వచ్చిన ఈ సమస్యను పరిష్కరించలేకపోయారు. స్థానిక కార్పొరేటర్ గుర్రాల రామా వెంకటేష్ యాదవ్ ఈ సమస్యను ఎలాగైనా పరిష్కరించాలి అని పట్టుదలతో తన సొంత భూమి అయినా ప్లాట్ నుండి కొంత భూమిని కాలనీవాసులకు దానం చేశారు. చరిత్రలో నిలిచిపోయేలా కమిటీ హాల్ కు పునాది వేశారు. ఈ విషయంలో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. శంకుస్థాపన కార్యక్రమానికి కాలనీ అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు, స్త్రీలు, యువత, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

# రైతన్నలకు అండగా బిఆర్ఎస్ పార్టీ

- రుణమాఫీ అమలులో ప్రభుత్వం విఫలమైంది
- దొంతం చంద్రశేఖర్ రెడ్డి
- చింతపల్లి మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు

**జయభేరి, చింతపల్లి :**

రైతులకు అండగా బిఆర్ఎస్ పార్టీ నిలుస్తుందని చింతపల్లి మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దొంతం చంద్రశేఖర్ రెడ్డి అన్నారు.చింతపల్లి మండల కేంద్రములో రైతులకు ఇవ్వవలసిన వర్షాకాల రైతు భరోసా ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న విధానాలకు నిరసనగా బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి కాంగ్రెస్ ప్రభుత్వం సియం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహ్నం చేసారు.ఇట్టి కార్యక్రమంలో ఆయన పాల్గొన్ని మాట్లాడుతూ.. ఎకరానికి 15 వేల రైతు భరోసా ఇస్తామని చెప్పి రైతులను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ రైతులకు క్షమాపణ చెప్పాలని ఆయన అన్నారు.

రుణమాఫీ అమలులో ప్రభుత్వం విఫలమైందని రైతులందరికీ రుణమాఫీ చేయాలని చేసి ఆయన డిమాండ్ చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ ఆశ చూపించి దాన్ని విస్మరించిందని మండిపడ్డారు.

ఈ కార్యక్రమంలో చింతపల్లి గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎల్లంకి చంద్రశేఖర్, బిఆర్ఎస్ పార్టీ ప్రచార కార్యదర్శి వింజమూరి రవి, రైతు విభాగం అధ్యక్షులు మర్రు రామారావు, యస్టి సెల్ అధ్యక్షుడు రమావత్ కొండల్ నాయక్, బిఆర్ఎస్ నాయకులు దండేటికార్ మోహన్, యం.డి ఖాలేద్, నల్ల శంకర్, చింతపల్లి మండల యూత్ అధ్యక్షులు సిమర్ల కృష్ణ యాదవ్, ఉప్పల యాదయ్య, తిరుమణి పాపయ్య, కాయితి బచ్చిరెడ్డి, రమావత్ మాంత్య నాయక్, వంకుడావత్ బాల్ సింగ్, జర్పుల రాజు, మల్లోజు గోపి, ధన్ రాజ్, సిద్ద స్వామి, బద్రి అంజి, ఊరే మదు, శేఖర్, మల్లోజు గోపి, జిట్ట జగదీష్, ఆరెకంటి మురళి, గార్లపాటి రవిచంద్ర, కోట మరి బాబు, సమ్మిడి జంగారెడ్డి, వింజమూరి అబ్బయ్య, వరికుప్పల కృష్ణ, రైతులు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# నిరసనలతో హోరెత్తిన అంబేద్కర్ చౌరస్తా..

- నిరసన కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రమావత్ దస్రునాయక్

**జయభేరి, కొండమల్లేపల్లి :**

కొండమల్లేపల్లి మండలం అంబేద్కర్ చౌరస్తాలో భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షులు శ్రీ. కేటీఆర్ పిలుపుమేరకు రైతు రుణమాఫీ, రైతు భరోసా వెంటనే ప్రతి లబ్ధిదారునికి అందేలా నిధులు విడుదల చేయాలని కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలతో కలిసి పాల్గొన్న BRS పార్టీ మండల అధ్యక్షులు రమావత్ దస్రు నాయక్. కొండమల్లేపల్లి మండల కేంద్రం అంబేద్కర్ చౌరస్తాలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, రైతుల సమక్షంలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలియజేస్తూ ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. నిరసన తెలుపుతున్న నాయకులు పోలీసులు అక్రమ అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కి తరలించి కేసులు పెడుతామని బెదిరించి న రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మ దహనం చేయడం జరిగినది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రమావత్ దస్రునాయక్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రానికి తెలంగాణ రైతాంగానికి గడచిన 10 నెలల కాంగ్రెస్ పాలనలో రైతులు ఎప్పుడు చూడని కష్టాలు చవి చూశారని , గత సమైక్యాంధ్రప్రదేశ్ పాలన కన్నా ఘోరమైన పరిపాలన చేస్తున్నారని అన్నారు, మరియు కాంగ్రెస్ ప్రభుత్వము ఎన్నికల ముందు అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి నేడు రైతులను, ప్రజలను వివిధ రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఇప్పటికైనా కళ్లు తెరిచి కాంగ్రెస్ పార్టీ మరియు రేవంత్ రెడ్డి బుద్ధి తెచ్చుకొని రైతులకు లబ్ధిదారులందరికీ రెండు లక్షల రుణమాఫీ మరియు రైతు భరోసా నిధులు విడుదల చేసి న్యాయం చేయాలని, లేకపోతే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు క్షమించరని, ప్రజలు తలుచుకుంటే ప్రభుత్వాలు కులుతాయని ఆగ్రహం వ్యక్తం చేశారు, ఈ రాష్ట్రంలోఅసలు పరిపాలన ఉందా, పిచ్చోడి చేతిలో రాయిలా ఉంది రేవంత్ రెడ్డి పరిపాలనని, పరిపాలన గాడిదప్పిందని అని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మాజీ రైతుబంధు అధ్యక్షులు కేసాని లింగారెడ్డి, రమేష్‌నాయక్, లింగం యాదవ్, రామావత్ శ్రీను, రూప్లనాయక్, జాగ్యు నాయక్, పాండు నాయక్, శంకర్ నాయక్, పెద్దిశెట్టి సత్యం, సురేష్, అమర్ సింగ్, శేఖర్, కోటేష్, వెంకటేష్, వెంకటయ్య, భీమా నాయక్, వెంకటేష్, ధన్సింగ్, హరికృష్ణ మండల నాయకులు, కార్యకర్తలు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పోచారం మున్సిపల్ పరిధిలోని చౌదరిగుడా వెంకటాద్రి టౌన్షిప్ ఫేజ్ 2, 3 యాదాద్రి కాలనీ, వెంకటపురం, వైభవ్ కాలనీ, కొర్రెములలో పర్యటించి పలు సమస్యలు అడిగి తెలుసుకున్న చైర్మన్ బోయపల్లికొండల్ రెడ్డి. ఆదివారము పోచారం మున్సిపల్ పరిధిలోని చౌదరిగుడా వెంకటాద్రి టౌన్షిప్ ఫేజ్ 2, 3 యాదాద్రి కాలనీ, వెంకటపురం, వైభవ్ కాలనీ, కొర్రెములలో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించి కాలనీ వాసులతో నడుస్తూ పలు సమస్యలు అడిగి తెలుసుకున్నరు. ఈ కార్యక్రమంలో చైర్మన్, కౌన్సిలర్ సుర్వి రవీందర్ నాయకులు, అకిటీ బల్ రెడ్డి, కాలనీ వాసులు సతీష్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**జయభేరి, ఘట్కేసర్**



# కాంగ్రెస్ గెలిస్తే రైతుబంధుకు రాం రాం

- కేసీఆర్ మాటలను రేవంత్ రెడ్డి సర్కార్ అక్షరాల నిజం చేసింది
- వానాకాలం పంట సీజన్ కు రైతుబంధును పూర్తిగా ఎగ్గొట్టేసింది
- లక్షలాది మంది రైతుల నోట్లో మట్టి కొట్టింది

**జయభేరి, దేవరకొండ :**



రేపు, మాపు అంటూ నెట్టుకొస్తున్నప్పుడే ఈ ప్రభుత్వం మీద అనుమానం కలిగింది. ఇప్పుడు స్వయంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు చేతులేస్తున్నట్లు ప్రకటించారు. మీ చేతగానీ తనంతో రైతన్నలను మోసం చేస్తామంటే ఊరుకునేలేదు. సబ్ కమిటీ, గైడ్ లైన్స్ అంటూ పెట్టుబడి సాయాన్ని ఎగ్గొడతామంటే రైతులు మిమ్మల్ని వదిలిపెట్టరు. ఎద్దు ఏడ్చినా ఏవుసం, రైతు ఏడ్చినా రాజ్యం బాగుపడదంటారు. అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని విధాలుగా రైతును ఏడిపిస్తున్న కాంగ్రెస్ కు వారి ఉసురు తప్పదు. రైతు భరోసాకు డబ్బులు లేకపోవటంతోనే సబ్ కమిటీ అంటూ డ్రామాలు స్టార్ట్ చేశారు. కేసీఆర్ పదివేలు ముష్టి వేస్తున్నాడు.. మేము రూ. 15 వేలు ఇస్తామన్న కాంగ్రెస్. పేదల ఇండ్లను, జీవితాలను పడకొట్టి రూ. లక్షా 50 వేల కోట్లతో మూసీ సుందరీకరణకు డబ్బులుంటాయా మీరుచెప్పినట్లు రైతులకు ఎకరానికి రూ. 7500 ఇచ్చేందుకు పైసలు లేవా పచ్చి అబద్దాలు, మోసాలతో రైతులను దగా చేశారు. నీ దగాకోరు మాటలు నమ్మి గెలిపించిన రైతులను అరిగోస పెడుతున్నారు.


**రుణమాఫీ మోసం చాలదన్నట్లు... ఇప్పుడు రైతు భరోసాలోనూ దగానే**

ఎట్టి పరిస్థితుల్లో రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వాల్సిందే. లేదంటే ఎక్కడికక్కడ మీ ప్రజాప్రతినిధులను ప్రజలే నిలదీస్తారు. రైతులకు బీఆర్ఎస్ అండగా ఉంటుంది రైతు భరోసా ఇచ్చే వరకు కాంగ్రెస్ వదిలేది లేదు. రైతులకు ఇవ్వాల్సిన ఈ వర్షాకాలం రైతుభరోసా ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వ తీరుకి నిరసనగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో దేవరకొండ పట్టణంలోని బస్ స్టాండ్ వద్ద రాస్తా రోకో, ప్రభుత్వం దిష్టిబొమ్మను దగ్ధం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గాజుల ఆంజనేయులు, మాజీ వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్ గౌడ్, బిఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేముల రాజు, బిఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ, మాజీ ఎంపీటీసీ ఫోరం అధ్యక్షుడు రమావత్ నర్సింహ, జనీబాబా, బాబా (బిఎన్ ఆర్ కాలనీ), ఆఫ్రోజ్, పల్లా లోహిత్ రెడ్డి, సీనియర్ నాయకులు నల్లగాసు సత్యనారాయణ, సూరి, యువజన విభాగం మండల, పట్టణ అధ్యక్షులు జెల్ల రేణు, యూత్ అధ్యక్షులు పొట్ట మధు, బిఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు పాత్లవత్ లక్ష్మణ్, SK. జమిర్ బాబా, మాడం రాములు (అడ్వకేట్), దూడ బావోజీ, జూలూరు రమేష్ గౌడ్, సభవత్ నరహరి, గుండాల వెంకట్, అదరపు హరికృష్ణ, జానీ, పగిడిమర్రి సతీష్, నేనావత్ కళ్యాణ్, మల్లేష్‌నాయక్, కొమ్ము ఉదయ్, లెండల లక్ష్మీకాంత్, వెంకటేష్, శ్రీను, రవి, మహేష్, శ్రీనివాస్, మల్లేష్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.



# నేటి నుంచే గ్రూప్1 మెయిన్స్

- మధ్యాహ్నం 12.30 నుంచే పరీక్షా కేంద్రంలోకి అనుమతి
- 1.30 గంటలకు గేట్లు బంద్.. 2 గంటల నుంచి 5 గంటల వరకు పరీక్ష
- తొలి పరీక్ష హాల్‌టికెట్‌నే చివరి పరీక్ష వరకు వెంట ఉంచుకోవాలి
- పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు



**జయభేరి, హైదరాబాద్:**

రాష్ట్ర సివిల్ సర్వీస్ ఉద్యోగాలుగా పేర్కొనే గ్రూప్1 కొలువుల భర్తీకి సంబంధించిన మెయిన్స్ పరీక్షలు సోమవారం ప్రారంభమవుతున్నాయి. ఈనెల 27వ తేదీ వరకు వరుసగా జరిగే ఈ పరీక్షలకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పకడ్బందీగా ఏర్పాట్లు చేసింది. హైదరాబాద్ జిల్లాలో 8, రంగారెడ్డి జిల్లాలో 11, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 27 పరీక్షా కేంద్రాలు కలిపి.. మొత్తం 46 కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయి. మొత్తం 563 గ్రూప్1 పోస్టుల కోసం 31,383 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పరీక్షా కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు పరీక్షల నిర్వహణ, భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించాలని ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. ప్రతి పరీక్ష హాల్, చీఫ్ సూపరింటెండెంట్ రూమ్, పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. టీజీపీఎస్సీ కార్యాలయం నుంచి నేరుగా పర్యవేక్షించేలా ఏర్పాట్లు చేశారు. సహాయకుల (స్క్రైబ్) ద్వారా పరీక్ష రాసే దివ్యాంగులకు ప్రత్యేకంగా ఒక గంట అదనంగా కేటాయిస్తారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. అన్ని కేంద్రాలకు ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులను నడుపుతున్నారు.

**ఏడు రోజులు... ఏడు పరీక్షలు..**

సోమవారం నుంచి 27వ తేదీ వరకు ఏడు రోజులు.. ప్రతిరోజు మధ్యాహ్నం 2గంటల నుంచి 5గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ప్రతి పరీక్షకు 3గంటల సమయం ఉంటుంది. ప్రతి పరీక్షకు గరిష్ట మార్కులు 150. జనరల్ ఇంగ్లిష్ మినహా మిగతా పరీక్షలను ఇంగ్లిష్, తెలుగు, ఉర్దూ భాషల్లో ఏదో ఒక దానిలో రాయవచ్చు. అయితే అన్ని పరీక్షలను ఒకే భాషలో రాయాలి. అభ్యర్థులు అన్ని పరీక్షలకు తప్పకుండా హాజరుకావాలి. అభ్యర్థులను మధ్యాహ్నం 12.30 గంటల నుంచే పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు. 1.30 గంటలకు పరీక్షా కేంద్రాన్ని మూసివేస్తారు. తర్వాత ఎట్టి పరిస్థితుల్లో అభ్యర్థులను లోనికి అనుమతించరు. అభ్యర్థి తొలి పరీక్షకు వినియోగించిన హాల్‌టికెట్‌నే చివరి పరీక్ష వరకు వెంట ఉంచుకోవాలి. డూప్లికేట్ హాల్‌టికెట్ జారీ చేసే అవకాశం ఉండదు.

# 29 జీవోను రద్దు చేయాల్సిందే..

- అశోక్‌నగర్‌లో గ్రూప్- 1 అభ్యర్థుల ప్రెస్‌మీట్
- అభ్యర్థులను అదుపులోకి తీసుకున్న పోలీసులు



**జయభేరి, హైదరాబాద్ :**

**జీవో 29 వల్ల తమ జీవితాలు నాశనమవుతాయని, కాబట్టి ఆ జీవోను రద్దు చేసి గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలని అభ్యర్థులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు.**

ఎవరో చెప్పిన మాటలు విని తమ భవిష్యత్తును నాశనం చేయవద్దని కోరారు. ఒక్కరోజు సమయం మాత్రమే ఉందని, తమతో ఒక్కసారి చర్చించి ఆ తర్వాతే సీఎం నిర్ణయం తీసుకోవాలని విన్నవించారు. ఈ మేరకు ఆదివారం మధ్యాహ్నం అశోక్‌నగర్‌లో అభ్యర్థులు ప్రెస్‌మీట్ నిర్వహించారు.

జీవో 29పై కోర్టులో కేసు నడుస్తోందని, ఈ జీవో రద్దు అయితే ఇప్పుడు మెయిన్స్ పరీక్షలు నిర్వహించినా, మళ్లీ నిర్వహించాల్సి వస్తుందని అన్నారు. దానివల్ల ప్రతిభావంతులకు అన్యాయం జరిగే ప్రమాదం ఉందని, అందుకే పరీక్షలు వాయిదా వేయాలని కోరుతున్నామని తెలిపారు. ప్రెస్‌మీట్ నిర్వహిస్తున్న అభ్యర్థులను పోలీసులు అక్కడి నుంచి తరలించారు. ఈ సందర్భంగా తోపులాట, వాగ్వివాదం చోటుచేసుకుంది. ఎవరికీ ఇబ్బంది కలగకుండా ప్రెస్‌మీట్ పెట్టిన తమను అరెస్ట్ చేయడం ఎంతవరకు సబబు అని అభ్యర్థులు ప్రశ్నించారు.



# గీత పనివారల సంఘం 67వ వార్షికోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ

**జయభేరి, దేవరకొండ :**

కల్లుగీత వృత్తిరక్షణ వృత్తిదారుల హక్కుల సంక్షేమం కోసం ఏర్పాటైన గీత పనివారల సంఘం 67వ వార్షికోత్సవాల సందర్భంగా దేవరకొండ పల్లా పర్వత్ రెడ్డి భవన్ లో గీత పనివారల సంఘం జెండా ఆవిష్కరించిన దేవరకొండ నియోజకవర్గ గౌరవ అధ్యక్షులు చింతపల్లి పుల్లయ్య గౌడ్. ఈ సందర్భంగా గీత పనివారల సంఘం నియోజకవర్గ గౌరవ అధ్యక్షులు చింతపల్లి పుల్లయ్య గౌడ్ ,నియోజకవర్గ అధ్యక్షులు కుంభం జయరాములు మాట్లాడుతూ వృత్తిరక్షణ, ఆధునీకరణ, ఉపాధి గ్యారెంటీ లక్ష్యంగా రాష్ట్ర వ్యాపితంగా గీత వృత్తిదారులు కార్య క్రమంలో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. 1957లో నాటి వరంగల్ జిల్లా లో ఏర్పడిన గీత పనివారల సంఘం నిర్వహించిన చారిత్రాత్మక ఉద్యమాలు, పోరాటాల ఫలితంగా వేలం విధానం రద్దు చేయబడి కల్లు గీత సహకార సంఘాలకు, టి ఎఫ్ ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టినట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

చెట్లపై నుండి పడి మరణించిన కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా, పెన్షన్, వన పెంపకానికి భూమి, కల్లు గీత వృత్తి ఆధునీకరణకు ప్రభుత్వాలతో పోరాడి సాధించుకున్నట్లు తెలిపారు. మద్య నిషేధం పేరుతో కల్లు గీత వృత్తి రద్దుకు కేంద్ర, రాష్ట్ర స్థాయిలలో జరిగిన అన్ని కుట్రలను విచ్ఛిన్నం చేసి జాతీయ స్థాయిలో గీత పనివారల సంఘం అగ్ర నాయకులు ధర్మభిక్షం, ఎస్.కుమారన్ నేతృత్వంలో వృత్తిని రక్షించుకున్నామని, ఈ పోరాటంలో గీత పనివారల సంఘం ప్రముఖ పాత్ర వహించిందని ఆయన పేర్కొన్నారు.



ఈ నూతన ప్రభుత్వం గీత వృత్తిదారులకు సేఫ్టీ పరికరాలను అందజేస్తున్నందుకు హర్షం వ్యక్తం చేశారు. ప్రధానంగా గీత వృత్తిదారుల వన పెంపకానికి పది ఎకరాల ప్రభుత్వ భూమి, కల్లు దుకాణాల ఏర్పాటుకు వెయ్యి గజాల స్థలం, అందుకు కావాల్సిన ఆర్థిక ప్రోత్సాహం, ఎక్స్‌గ్రేషియా, పెన్షన్ పెంపుదల, ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎండి మైనొద్దీన్, గీత పనివారల సంఘం నియోజకవర్గ ఉపాధ్యక్షులు కాటం గోవర్ధన్, సహాయ కార్యదర్శి కుంభం సత్తయ్య, మండల అధ్యక్ష, కార్యదర్శులు జెల్ల నారయ్య, ఎరుకలి పుల్లయ్య, పిరాటి అంజయ్య, నాయకులుపొలాగోని గణేష్, కుంభం లక్షయ్య, పిరాటి ఆంజనేయులు, ఎరుకలి సత్యనారాయణ, కుంభం సత్తయ్య, జూలూరి శ్రీనివాస్, కాటం వెంకటయ్య, మరుపాకుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# స్థానికేతరులపై ముష్కరుల కాల్పులు

**జయభేరి, శ్రీనగర్:**

జమ్మూకశ్మీర్‌లో ఉగ్రమూకలు మళ్లీ పేట్రేగిపోయాయి. శ్రీనగర్‌లేహ్ జాతీయ రహదారిపై టన్నెల్ నిర్మాణ పనుల ప్రాంతంలో ఉన్న ఒక వైద్యుడు, ఐదుగురు స్థానికేతర కార్మికులను చంపేశారు. గందేర్‌బల్‌లోని గుండ్ ప్రాంతంలో ఆదివారం సాయంత్రం ఘటన చోటుచేసుకుంది. పనులు చేస్తున్న స్థానిక, స్థానికేతర కార్మికులు, ఇతర సిబ్బందిపై ఇద్దరు ఉగ్రవాదులు యథేచ్ఛగా కాల్పులకు తెగబడినట్లు సమాచారం. కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన ఇద్దరు అక్కడికక్కడే చనిపోగా, మరో ఐదుగురు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారని అధికారులు తెలిపారు. గాయపడిన మరో ఐదుగురు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారన్నారు. మృతులను డాక్టర్ షెహనవాజ్, ఫహీమ్ నజీర్, కలీం, మహ్మద్ హనీఫ్, శశి అబ్రోల్, అనిల్ శుక్లా, గుర్మీత్ సింగ్‌లుగా గుర్తించారు. ముష్కరులను పట్టుకునేందుకు భద్రతా బలగాలు ఆప్రాంతాన్ని దిగ్బంధించి, గాలింపు చేపట్టాయి. కశ్మీర్ ఐజీ వీకే బిర్డి తదితర అధికారులు ఘటనాస్థలికి చేరుకుని, పరిస్థితిని సమీక్షించారు. ఘటనను కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఖండించారు. ఉగ్రమూకలను వదిలేది లేదని స్పష్టం చేశారు. కాల్పుల ఘటనను సీఎం ఒమర్ అబ్దుల్లా ఖండించారు.




## భర్త బాగుండాలని అట్లతద్ది పూజ

టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ భార్య స్నేహ రెడ్డి గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. బన్నీ భార్యగానే కాకుండా తనకంటూ సోషల్ మీడియా సెలబ్రిటీగా గుర్తింపు సంపాదించుకుంది. నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ.. తన ఫ్యామిలీ, పిల్లల ఫోటోలు, వీడియోలు, వెకేషన్స్.. అన్నిటి గురించి షేర్ చేస్తూ ఉంటుంది. దీంతో బన్నీ అభిమానులు అంతా స్నేహని కూడా ఫాలో అవుతారు. అయితే ఈ భామ ప్రతి పండగను ఘనంగా జరుపుకుంటుంది. సంక్రాంతి, ఉగాది, వరలక్ష్మి వ్రతం ఇలా ఏ పండుగైన అచ్చ తెలుగింటి ఆడపిల్లలా సాంప్రదాయ చీరకట్టులో కనిపిస్తుంది. ఈ భామ తాజాగా తన భర్త అల్లు అర్జున్ బాగుండాలని అట్లతద్ది నోము చేసుకుంది. అట్ల తద్ది పండుగన్న విషయం తెలిసిందే. పెళ్లి కానీ అమ్మాయిలు తమకు మంచి భర్త రావాలని ఈ నోము ఆచరించగా.. పెళ్లి అయిన స్త్రీలు తమ సౌభాగ్యం కలకాలం ఉండాలని కోరుకుంటూ ఈ నోము చేసుకుంటారు. నార్త్‌లో ఇదే పండుగను కర్వా చౌత్ పేరుతో పిలుస్తారు. అయితే, తాజాగా స్నేహ రెడ్డి కూడా తన భర్త అల్లు అర్జున్ బాగుండాలని అట్లతద్ది నోము చేసుకుంది. అందంగా ముస్తాబై తెలుగింటి ఆడపిల్లలా ఉన్న ఆమె పూజ చేసిన ఫొటోలను





## అది పచ్చి అబద్ధం

ప్రభాస్, సందీప్‌రెడ్డి వంగా కాంబినేషన్‌లో రూపొందనున్న భారీ పాన్ ఇండియా సినిమా ‘స్పిరిట్’. ఈ ప్రెస్టేజియస్ ప్రాజెక్ట్‌లో బాలీవుడ్ క్రేజీ కపుల్ కరీనాకపూర్, సైఫ్ అలీఖాన్‌లు విలన్లుగా నటిస్తున్నారంటూ ఓ వార్త గత కొన్ని రోజులుగా మీడియా సర్కిల్‌లో ఓ రేంజ్‌లో హల్‌చల్ చేస్తున్నది. దీనిపై ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో క్లారిటీ ఇచ్చేసింది కరీనా కపూర్. ‘ఇప్పటివరకూ ‘స్పిరిట్’ సినిమాకు సంబంధించిన ఏ ఒక్కరూ మమ్మల్ని కలవలేదు. మా మధ్య చర్చలు జరిగాయి అన్నది పచ్చి అబద్ధం.’ అని తేల్చి చెప్పేసింది కరీనా. ఇంకా మాట్లాడుతూ ‘సౌత్ సినిమాలో నటించాలని నాకు బలంగా ఉంది. అయితే.. నాకు తగ్గ పాత్ర రావాలి. ఆ పాత్రకు కథలో మంచి ప్రాధాన్యత ఉండాలి. అలాంటి పాత్ర వస్తే తప్పకుండా నటిస్తా. అందరూ అనుకుంటున్నట్టు ‘స్పిరిట్’ ఆఫర్ నా దగ్గరకు వచ్చినా.. పాత్ర నచ్చితేనే చేస్తా. మాకైతే ఎలాంటి సమాచారం లేదు’ అంటూ చెప్పుకొచ్చింది కరీనా.



## ఆర్ఆర్ఆర్‌ను ఫాలో అవుతున్న పుష్ప 2

టాలీవుడ్ స్టార్ యాక్టర్ అల్లు అర్జున్ నటిస్తోన్న పాన్ ఇండియా ఫ్రాంచైజీ ప్రాజెక్ట్ పుష్ప 2 ది రూల్. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో కన్నడ భామ రష్మిక మందన్నా ఫీమేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. మాలీవుడ్ స్టార్ యాక్టర్ ఫహద్ ఫాసిల్ కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఈ మూవీని 2024 డిసెంబర్ 6న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారు. కాగా పుష్ప 2 ది రూల్ ఆర్ఆర్ఆర్ బాటలో పయనిస్తుందన్న వార్త ఒకటి నెట్టింట హల్ చల్ చేస్తోంది. ఆర్ఆర్ఆర్ డాల్బీ విజన్ ఫార్మాట్ తొలి తెలుగు సినిమాగా నిలిచిందని తెలిసిందే. ఇప్పుడు సుకుమార్‌బన్నీ ప్రాజెక్ట్ కూడా ఈ ఫార్మాట్‌లో సందడి చేయనుందని.. దీనికి సంబంధించి రీమాస్టరింగ్ పనులు కూడా జరుగుతున్నాయన్న వార్త ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. ప్రస్తుతానికి డాల్బీ విజన్ స్క్రీన్స్ అందుబాటులో లేవు. కానీ ఇంటర్నేషనల్ మూవీ లవర్స్ మాత్రం పుష్పరాజ్ సందడిని డాల్బీ విజన్‌లో చూసి ఎంజాయ్ చేయొచ్చన్నమాట. మరి ఈ వార్తలపై మేకర్స్ రాబోయే రోజుల్లో ఏదైనా క్లారిటీ ఇస్తారేమో చూడాలి. సీక్వెల్‌కు కూడా రాక్‌స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ మ్యూజిక్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. సీక్వెల్‌లో ఫహద్ ఫాసిల్, జగదీష్ ప్రతాప్ బండారి, జగపతిబాబు, ప్రకాశ్ రాజ్, సునీల్, అనసూయ భరద్వాజ్, రావు రమేశ్, ధనంజయ, షణ్ముఖ్, అజయ్, శ్రీతేజ్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## డ్రగ్ కల్చర్ నిర్మూలనే కథాంశంగా

ఆట సందీప్, శగ్నశ్రీ జంటగా రూపొందుతోన్న చిత్రం ‘ది షార్ట్‌కట్’. రామకృష్ణ కంచి దర్శకుడు. రంగారావు తోట, రజనీకాంత్ పున్నపు నిర్మాతలు. త్వరలో సినిమా విడుదల కానుంది. హైదరాబాద్‌లో ఈ సినిమా ట్రైలర్ లాంచ్ కార్యక్రమం జరిగింది.

ముఖ్య అతిథిగా విచ్చేసిన స్టార్ కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్ ట్రైలర్‌ని ఆవిష్కరించి, చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. మెట్రో పాలిటన్ సిటీస్‌లో పెరుగుతున్న డ్రగ్ కల్చర్‌పై ఈ సినిమా తీశామని, దీనికి పరిష్కారం కూడా చూపించామని దర్శకుడు చెప్పారు. ఇంకా హీరోహీరోయిన్లు కూడా మాట్లాడారు. ఈ చిత్రానికి కెమెరా: ఎస్.ఎన్.మీరా, సంగీతం: ఆర్.ఆర్.ధృవన్.



Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com